ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తిరుపతి

జిల్లా వార్తలు

ఆదివారం 21 జనవరి 2024

"తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో జరిగిన తప్పిదాలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటాం సరే... చేయించిన వారి సంగతేమిటి? ఎపిక్ కార్డులనేవి ఎన్నికల సంఘం ఆస్తి. మా ఆస్తిని కాజేయాలని చూస్తారా? ఇక్కడ ప్రజాస్వామ్యం వున్నట్టా? లేనట్టా? అధికారులు, ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి ఓటరు ఐడీ కార్డులు డౌన్‌లోడ్ చేయించిన వారెవరో తేల్చాలి...వారికి శిక్ష పడేలా చూడాలి... " ఇదీ కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారికి జారీచేసిన ఆదేశం. దీంతో ఓటరు ఐడీ కార్డుల డౌన్‌లోడ్, నకిలీ కార్డుల తయారీ వ్యవహారంలో సూత్రధారులెవర్నది తేల్చడానికి పోలీసు శాఖ ఆధ్వర్యంలో మూడు టెక్నికల్ టీములు ఏర్పాటయ్యాయి.మరోవైపు వివిధ రాజకీయ పక్షాల నాయకులు దొంగ ఓటర్ల వ్యవహారంపై ఇచ్చిన ఫిర్యాదుల పురోగతి, స్టేటస్ ఏమిటన్నది తేల్చడానికి విడిగా మరికొందరు అధికారులతో బృందాలు నియమితమయ్యాయి. దీంతో అధికారులను ముందు పెట్టి తెరవెనుక నుంచీ తతంగం నడిపించిన సూత్రధారులెవరన్నది త్వరలోనే వెలుగులోకి రానుంది.



తిరుపతిలో దొంగ ఓటర్ల వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న సీఈసీ

చేసిన అధికారులపై చర్యలు సరే... చేయించిన వారి సంగతేమిటని ప్రశ్న

సూత్రధారుల సంగతేంటి?

సాంకేతిక అంశాల దర్యాప్తునకు టెక్నికల్ టీముల ఏర్పాటు

పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుల స్టేటస్ కోసం విడిగా బృందాలు

తిరుపతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలే లక్ష్యంగా తయారు చేయించిన దొంగ ఓటర్ల వ్యవహారాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణిస్తోంది.ఈ వ్యవహారంలో తిరుపతి సెగ్మెంట్‌కు అప్పట్లో ఈఆర్వోగా పనిచేసిన నాటి తిరుపతి మున్సిపల్ కమిషనర్, ఇటీవలి వరకూ అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన గిరీషాను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అలాగే అప్పటి తిరుపతి సెగ్మెంట్ ఏఈఆర్వోగా పనిచేసిన తిరుపతి అర్బన్ తహసిల్దారు జయరాములు, ఎలక్షన్ డీటీగా పనిచేసిన విజయ్‌భాస్కర్ కూడా సస్పెండయ్యారు. రికార్డుల ఆధారంగా ఈ వ్యవహారానికి బాధ్యులైన అధికారులందరిపై ఈసీ చర్యలకు ఉపక్రమిస్తున్న సంగతి తెలిసిందే. దీనికి సమాంతరంగా మరో ప్రక్రియ మొదలైనట్టు తెలిసింది. పాత్రధారులైన అధికారులపై చర్యలు తీసుకుంటున్నామని, అయితే అధికారులతో ఈ తతంగం నడిపించిన సూత్రధారులెవరో తేల్చాలని ఈసీ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారిని ఆదేశించినట్టు తెలిసింది. సంబంధిత అంశంపై విచారణ త్వరగా ముగించి నివేదిక ఇవ్వాలని షరతు విధించినట్టు తెలిసింది. ఒకవేళ చేయలేని పరిస్థితి వుంటే తాము ఇతర ఏజెన్సీల ద్వారా సొంతంగా చేయించుకుంటామని కూడా స్పష్టం చేసినట్టు తెలిసింది. దీంతో సాంకేతిక అంశాలను తెలుసుకునేందుకు డీఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో మూడు టెక్నికల్ బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిసింది. ఆ బృందాలు ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించాయని కూడా సమాచారం.ఈ బృందాలు ఎక్కడెక్కడ, ఏ కంప్యూటర్ సిస్టమ్స్ ద్వారా ఓటరు ఐడీ కార్డులు డౌన్‌లోడ్ చేశారు? ఎవరెవరి లాగిన్లలో చేశారు? ఎన్ని సెషన్లలో ఎన్నెన్ని కార్డులు డౌన్‌లోడ్ చేశారు?ఆయా కంప్యూటర్లు ఎవరు వినియోగించారు? వాటి ఐపీ అడ్రసులు ఏవి? వినియోగించిన నెట్ కనెక్షన్ ఎవరిది? మొబైల్ ద్వారా నెట్ వినియోగించి వుంటే ఆ మొబైల్ ఫోన్లు ఎవరివి?... ఇలా సాంకేతిక అంశాలను నిగ్గు తేల్చేందుకు యత్నిస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ మున్సిపల్, రెవిన్యూ కార్యాలయాల్లో కాకుండా ప్రైవేటు కార్యాలయాలు, ఇళ్లలో గనుక ఈ తతంగం నడిచివుంటే, ప్రైవేటు కంప్యూటర్లు, ప్రైవేటు ఇంటర్‌నెట్ కనెక్షన్లు వినియోగించి వుంటే ప్రైవేటు వ్యక్తుల గుట్టు రట్టవుతుంది. వారి ద్వారా తెరవెనుక కుట్రదారులెవరన్నది తేలనుంది.

ఫిర్యాదుల పురోగతిని తేల్చే పనిలో మరిన్ని బృందాలు

మరోవైపు ఇతర జిల్లాలకు చెందిన డీఎస్పీ స్థాయి అధికారులకు ఇతర బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. తిరుపతి సెగ్మెంట్‌లో దొంగ ఓటర్లకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల నాయకుల నుంచీ, వ్యక్తుల నుంచీ అందిన ఫిర్యాదులు ఏమయ్యాయనే కోణంలో ఈ విచారణ సాగనుంది. పోలీసు స్టేషన్లలో ఇచ్చిన ఫిర్యాదులు నమోదయ్యాయా? కాలేదా? నమోదై వుంటే దర్యాప్తు చేశారా? నిందితులను అరెస్టు చేశారా? చార్జిషీట్లు వేశారా? కోర్టులో ప్రస్తుతం ఆ కేసులు ఏ దశలో వున్నాయి? వంటి అంశాలను పరిశీలించి కేసుల స్థితిని ఈ బృందాలు నివేదించాల్సి వుందని సమాచారం. దీనికోసం పొరుగు జిల్లా నుంచీ ఇద్దరు డీఎస్పీలు ఇప్పటికే పలు మార్లు తిరుపతి వచ్చి వివరాలు సేకరించినట్టు తెలిసింది.

కీలకం కానున్న ఆ ఎమ్మెల్యే ఆడియో క్లిప్

తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో దొంగ ఓట్లకు సంబంధించి అప్పట్లో ఓ వైసీపీ ఎమ్మెల్యే చేసిన ఫోన్ సంభాషణ తాలూకూ ఆడియో క్లిప్పింగ్ కీలకం కానుంది. ఎక్కడి నుంచో ఓ వ్యక్తి సదరు ఎమ్మెల్యేకి పోలింగ్ ముందురోజు ఫోన్ చేసి 450 మంది ఓట్లు వేయడానికి సిద్ధంగా వున్నారని, వారిని తీసుకురమ్మంటారా అని అడగడంతో వారి మధ్య జరిగిన సంభాషణ ఆడియో క్లిప్ అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అయింది. ఆ సంభాషణ యథాతథంగా....

సార్... రామ్ మాట్లాడతారు అన్న మాటతో సంభాషణ ప్రారంభమైంది.

ఎమ్మెల్యే : ఇప్పుడూ ఇంత రేత్రిలో కష్టమూ... వచ్చినా టైమ్ సరిపోదని మనోళ్ల ఫీలింగ్

రామ్: అవునా సర్

ఎమ్మెల్యే: ఓటింగ్ టైమ్ సరిపోదు

రామ్: అంటే మనకు నైన్ అవర్సే కదా సర్ జర్నీ

ఎమ్మెల్యే : లేదు హడావిడైపోతుంది. 450 మందిని... ఏడు బస్సులు కాదు పన్నెండు బస్సులు కావాలి.

రామ్: లేదు సర్ ఫిఫ్టీ మెంబర్స్ కెపాసిటీ కదా సర్.

ఎమ్మెల్యే: అవునయ్యా తొమ్మిది బస్సులు కావాలి. తొమ్మిది బస్సుల్లో వచ్చి మధ్యలో ఆపుతారు.చాలా ఇష్యూస్ వుంటాయి ఇక్కడ. దారిపొడుగూకా ఆపుతారు.

రామ్: అంటే మన టీమ్ వస్తున్నారు కద సార్. ఎంప్లాయిస్ వీళ్ళ కో ఆర్డినేట్ చేసుకుంటారు

ఎమ్మెల్యే: అది ముందు చూసుకోవల్ల... రెండు రోజుల ముందనుకోని వుంటే ప్లాన్ చేసుకోని వుండచ్చు

రామ్: ఆల్‌రెడీ మేమెప్పుడో చెప్పాము సార్ ఇది

ఎమ్మెల్యే: నాతో డిస్కస్ చేయలేదు ఎవరూ

రామ్: మేము సార్ గారికి చెప్పాము... మీకు పంపించమని చెప్పేసరికి మేము

ఎమ్మెల్యే: ఇప్పుడు అందరినీ నిద్ర లేపి... నాలుగు గంటలకు బయల్దేరిపిచ్చి

రామ్: లేదు సర్ ఆల్రెడీ అందరికీ మేము

ఎమ్మెల్యే: ఈ 400 ఓట్లు ఇక్కడేసుకుంటాములే... ఏదో రకంగా మేనేజ్ చేసుకుని... వాళ్ళ ఓట్లు మనం ఎవరో ఒకరితో వేయించుకునేస్తే సరిపోతుంది... ఎందుకు పాపం వాళ్ళకు శ్రమ... మళ్ళా వచ్చి వెళ్లిపోవల్ల కదా... అంత శ్రమవద్దులే. 400 ఓట్లు ఈడ వేసేసుకోవచ్చులే...

రామ్: సరే సర్

ఈ ఆడియో క్లిప్ అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొట్టింది. ప్రత్యేకించి తిరుపతి ప్రాంతంలో బాగా సర్క్యులేట్ అయింది. దీంట్లో సంభాషణ వింటే బహుశా హైదరాబాదులో ఏదైనా కంపెనీ లేదా ఫ్యాక్టరీ వంటిచోట పనిచేస్తున్న తిరుపతి ప్రాంతానికి చెందిన 450మందిని తిరుపతికి తరలించి వారితో ఓట్లు వేయించేందుకు ఏర్పాట్లు చేసినట్టుగా వుంది. అది కూడా పోలింగ్ ముందురోజు రాత్రి ఫోన్ సంభాషణ జరిగినట్టు వుంది. పోలింగ్ రోజు తెల్లవారుజామున 4 గంటలకు బయల్దేరి 9 గంటల్లో తిరుపతి చేరుకోవడం అంటే ఖచ్చితంగా హైదరాబాదు నుంచీ తరలించే ప్రయత్నమేనని భావించాల్సి వచ్చింది. ప్రయాణ వ్యవధి 9గంటలే అయినా మధ్య మధ్యలో పోలీసు, రవాణా శాఖల అధికారులు ఆపి తనిఖీ చేయడం, ఇతర అవసరాలకు వాహనాలు ఆపితే తిరుపతి చేరుకునే సరికి పోలింగ్ సమయం ముగిసిపోయే అవకాశమున్నందునే ఆ ప్రయత్నం విరమించుకుని వారి ఓట్లను ఇక్కడే ఎవరితోనైనా వేయించేయాలన్న నిర్ణయానికి వచ్చారని అనిపించింది. ఆడియో క్లిప్పింగ్ విన్న స్థానిక టీడీపీ నేతలు దీన్ని జత చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. కాగా టీడీపీ అధినేత చంద్రబాబు సైతం దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. పోలింగ్ ముగిసిన రెండో రోజు ఈ ఆడియో టేపు వెలుగు చూసింది. ఇపుడు దొంగ ఓటర్ల వ్యవహారంపై ఈసీ విచారణకు, చర్యలకు ఉపక్రమించిన నేపథ్యంలో ఈ ఆడియో టేపు కూడా కీలక ఆధారంగా మారే అవకాశముంది.



తిరుచానూరులో వివరాలు సేకరిస్తున్న సచివాలయ సిబ్బంది

కులగణనకు సర్వర్ చిక్కులు

● రెండు రోజుల్లో 9శాతంమంది వివరాలు మాత్రమే సేకరణ

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 20: జిల్లావ్యాప్తంగా కులగణన ప్రక్రియకు రెండవ రోజైన శనివారం కూడా సాంకేతిక సమస్యలు తలెత్తాయి. పలు ప్రాంతాల్లో యాప్ పనిచేయకపోవడంతో వివరాల నమోదు ప్రక్రియ ముందుకు సాగక సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇబ్బందులు పడ్డారు.691 సచివాలయాలను 12,357క్లస్టర్లుగా విభజించగా వాటిలో 9,555క్లస్టర్లలో మాత్రమే కులగణన ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలోని 7,14,853 ఇళ్లకు గాను రెండ్రోజుల్లో 94,662ఇళ్లను సందర్శించి వివరాలను సేకరించారు. జిల్లావ్యాప్తంగా 13.24శాతం గృహాలు, 9.92శాతం కుటుంబ సభ్యులను సర్వే చేయగలిగారు. కులగణనకు సంబంధించి ప్రతి ఇంటి వద్ద సర్వే చేయడానికి అరగంట సమయం పడుతోందని సచివాలయ సిబ్బంది వాపోతున్నారు. సుమారు 30 ప్రశ్నలకు ఆన్‌లైన్‌లో సమాధానాలు నమోదు చేయాల్సి రావడం, సర్వర్లు అంతంతమాత్రమే పనిచేస్తుండడంతో ఇంటి యజమాని, వలంటీరు, సచివాలయ సిబ్బంది వేలిముద్రలు అప్‌లోడ్ కావడంలేదు.కులగణన ప్రక్రియకు ఈ నెల 28వ తేది వరకు గడువుండగా సర్వర్ సమస్యలు కొనసాగితే ఆ లోపు వివరాలసేకరణ సాధ్యమేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మా ఆస్తుల వివరాలతో మీకేం పని?

కులగణన సర్వేలో ఆస్తులు, ఆదాయం, పొలాలు, భూములు, కార్లు వంటి వివరాలను సేకరిస్తున్నారు. వీటితో పాటు ఆవులు, కోళ్ల వంటి వివరాలను కూడా అడుగుతున్నారు.దీంతో చాలామంది వివరాలు చెప్పడానికి ఇష్టపడడం లేదు.ఆస్తులు ఎక్కడెక్కడున్నాయని అడిగితే మీకు కావాల్సింది కుల వివరాలు మాత్రమే కానీ మా ఆదాయ వనరులతో మీకేం పనంటూ జనం నిలదీస్తున్నారు. అధికారులు చెప్పినట్లు చేయాలి కదా అని సచివాలయ సిబ్బంది వివరాల కోసం ప్రాధేయపడుతున్నారు.

24న సీఎం తిరుపతి రాక

తిరుపతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24వ తేదీన ముఖ్యమంత్రి జగన్ తిరుపతి రానున్నారు.జిల్లా అధికార యంత్రాంగానికి అందిన సమాచారం మేరకు ఈనెల 23, 24 తేదీల్లో ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్ పేరిట జాతీయ స్థాయి విద్యా సమ్మేళనం తిరుపతిలో జరగనుంది. పలు రాష్ట్రాలకు చెందిన విద్యావేత్తలు పాల్గొంటారని సమాచారం. నగరంలోని హోటల్ తాజ్‌లో జరిగే ఈ రెండు రోజుల కార్యక్రమానికి సంబంధించి 24వ తేదీన సీఎం జగన్ హాజరవుతారు. దీని కోసం 22న విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తిరుపతి వస్తున్నారు. ఆయన వచ్చాకే సీఎం జగన్ పాల్గొనే కార్యక్రమాలు ఖరారవుతాయని జిల్లా అధికారులు చెబుతున్నారు. సీఎంవో నుంచీ వచ్చిన సమాచారంతో శనివారం సాయంత్రం కలెక్టర్ వెంకట్రమణారెడ్డి జిల్లా విద్యా శాఖ అధికారులతో సమీక్షించారు. అనంతరం హోటల్ తాజ్‌కు కూడా వెళ్ళి ప్రాథమికంగా ఏర్పాట్ల గురించి పరిశీలించారు.

అధికారులు అప్రమత్తం

● బోగస్ ఓట్ల పునఃపరిశీలనలో యంత్రాంగం బిజీబిజీ

తిరుపతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):తిరుపతి దొంగ ఓట్ల కుంభకోణంపై ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యలతో అధికారులు అప్రమత్తమయ్యారు.ఫైనల్ ఓటరు జాబితాను తప్పుల్లేకుండా చూసే పనిలో పడ్డారు. తిరుపతి అసెంబ్లీకి ఈఆర్వోగా ఉన్న మున్సిపల్ కమిషనర్ హరిత సిబ్బందితో సమీక్షలు నిర్వహిస్తున్నారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకూడదని హెచ్చరిస్తున్నారు. బీఎల్వోలు, ఇతర అధికారులతో కలిసి జాబితాను పునఃపరిశీలిస్తున్నారు. తాజాగా గుర్తించిన నకిలీ ఓట్ల జాబితాను ఇవ్వాలని విపక్ష పార్టీ నేతలను అడిగి తెప్పించుకుంటున్నట్టు సమాచారం. చంద్రగిరి నియోజకవర్గ ఈఆర్వోగా ఉన్న ఆర్డీవో నిషాంత్ రెడ్డిపై కూడా ఈ సీ కొ ర డా ప్రభావం కనిపిస్తోంది. రెవెన్యూ సిబ్బందిని కాకుండా ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 10మంది సిబ్బందిని డిప్యుటేషన్‌పై తీసుకున్నారు. ప్రతి మండలానికీ ప్రత్యేకాధికారులను నియమించి ఓటర్ల జాబితా పునఃపరిశీలనలో బిజీబిజీగా కనిపిస్తున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లి ర్యాండమ్‌గా తనిఖీ చేస్తున్నారు.గుర్తించిన నకిలీ ఓట్లను తొలగించే పనిలో పడ్డారు. ఈ క్రమంలో వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి పదిమందిపై కేసులు కూడా నమోదు చేసినట్టు తెలిసింది.

ఆ ఓట్ల జాబితా ఇవ్వండి : టీడీపీ

దొంగ ఓట్ల కుంభకోణంలో ప్రధాన పాత్రను వైసీపీ కార్యాలయాలు పోషించాయని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. తిరుపతి ఉప ఎన్నికకు సంబంధించి నాటి ఎలక్టోరల్ రిటర్నింగ్ ఆఫీసర్(ఈఆర్వో) లాగిన్ నుంచి దాదాపు 34వేల బోగస్ ఎపిక్ కార్డులు ముద్రించారని ఎన్నికల కమిషన్ గుర్తించిన విషయం తెలిసిందే.ఎన్నికల సంఘం గుర్తించిన దొంగ ఓట్ల జాబితా కావాలని టీడీపీ తిరుపతి ఇన్‌చార్జి సుగుణమ్మ శనివారం కలెక్టర్ వెంకట్రమణారెడ్డిని, కమిషనర్ హరితను కలిసి కోరారు. అయితే ఆ జాబితా తమ వద్దలేదని పోలీసుల విచారణలో ఉందని వారు చెప్పారు.ఈ సందర్భంగా సుగుణమ్మ మీడియాతో మాట్లాడుతూ తిరుపతిలో వైసీపీ నేతల పనులతో అధికారులు బలైపోతున్నారన్నారు. ధర్మయుద్ధం చేయమని తాము పదేపదే చెబుతున్నామని, అయితే వారు దొంగ ఓట్లపైనే ఆధారపడుతున్నారని మండిపడ్డారు. ఫేక్ ఓటరు లేకుండా పునఃపరిశీలన చేసి అసలైన ఓటరు జాబితాతో ఎన్నికల్లోకి రావాలని చెప్పారు. అధికారులు మరింత అప్రమత్తంగా ఉండి చర్యలు చేపట్టాలని కోరారు. టీడీపీ నాయకులు నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, బుల్లెట్ రమణ, శ్రీధర్ వర్మ, దంపూరి భాస్కర్ యాదవ్, చినబాబు, మహేష్ యాదవ్, పుష్పావతి, కృష్ణ యాదవ్, కంకణాల రజనీకాంత్, కరాటే చంద్ర, ఆముదాల తులసి తదితరులు ఆమె వెంట వున్నారు.

ముక్కంటి సొమ్మును బొక్కేస్తున్నారు...!

● దర్శన టికెట్ల నగదు జేబులో వేసుకున్న ఉద్యోగి

● రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నా సమగ్ర చర్యలేవీ?

శ్రీకాళహస్తి, జనవరి 20 : శ్రీకాళహస్తీశ్వరాలయంలో రోజుకో అవినీతి బాగోతం వెలుగు చూస్తోన్నా సరైన చర్యలు తీసుకోకపోవడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ఇటీవల ముక్కంటి ప్రత్యేక దర్శన టికెట్ల విక్రయాలు పెరిగాయి. శీఘ్రదర్శనం రూ.200, ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.50గా టికెట్లు నిర్ణయించారు. టికెట్లు జారీ చేయడం తప్ప క్యూలైన్లలో ఎక్కడా వీటిని తనిఖీ చేయరు. కేవలం కౌంటర్లు మాత్రమే కనిపిస్తాయి. కొందరికి టికెట్లు ఇవ్వడం... మరికొందరికి నగదు తీసుకొని లైన్లోకి పంపేయడం జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. అందుకే ఈ టికెట్ల కౌంటర్ల వద్ద పని చేసేందుకు పెద్దఎత్తున లాబీయింగు చేస్తుంటారు. నెల క్రితం రూ.200 టికెట్ కౌంటర్లో కొందరు ఉద్యోగులు భక్తుల నుంచి నగదు తీసుకొని టికెట్లు ఇవ్వకుండా దర్శనానికి పంపారు.ఆలయ డిప్యూటీ ఈవో వెంకటసుబ్బయ్య మహాద్వారం వద్ద తనిఖీ చేయడంతో ఇది బయటపడింది.అయితే అక్రమార్కులు తమ పలుకుబడితో ఈ విషయాన్ని కప్పేశారు. కౌంటర్లో పనిచేసే ఇద్దరు ఉద్యోగులను ఉన్నతాధికారులు వేరే విభాగానికి బదిలీ చేసి ఊరుకున్నారు. తరువాత ఆ టికెట్టు కౌంటరు ద్వారా రికార్డు స్థాయిలో అమ్మకాలు నమోదయ్యాయి. ఒక రోజు ఏకంగా రూ.10 లక్షలు కేవలం ఒకే కౌంటరు నుంచి ఆదాయం వచ్చింది.తాజాగా శనివారం రూ.50 టికెట్ కౌంటర్లో పని చేసే ఒప్పంద ఉద్యోగి ఐదుగురు భక్తుల నుంచి నగదు తీసుకుని టికెట్లు ఇవ్వకుండానే క్యూ లైన్‌లోకి పంపాడు.ఈసారి కూడా డిప్యూటీ ఈవో వెంకటసుబ్బయ్యే మహాద్వారం వద్ద ఆ భక్తులను అడ్డుకున్నారు.ఈసారి కూడా కఠిన చర్యలు తీసుకోవడం వదిలేసి ఆ ఒప్పంద ఉద్యోగిని పాతాళ గణపతి వద్దకు బదిలీ చేసి సర్దేశారు.ఇంత బాహాటంగా అవినీతి జరుగుతున్నా టికెట్ల తనిఖీ కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఎందుకు ఏర్పాటు చేయడం లేదన్న ప్రశ్నలు విన్పిస్తున్నాయి.



ఎస్‌ఈబీలో పలువురి బదిలీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 20: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ)లో పలువురు సీఐలు, ఎస్‌ఐలు బదిలీ అయ్యారు.తిరుపతి రూరల్ సీఐ కేవీఎస్ ఫణీంద్ర తాడిపత్రికి, చంద్రగిరి సీఐ లీలారాణి కడప జిల్లా ఎర్రగుంట్లకు బదిలీ అయ్యారు. పుత్తూరు సీఐ ఎస్. కృష్ణ అనంతపురం బదిలీ కాగా శ్రీకాళహస్తి సీఐ వెంకట పవన్ కుమార్ రాజంపేటకు, తిరుమల సీఐ తిరుమలయ్య కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. తిరుపతి ఇంటెలిజెన్స్ సీఐ శ్రీనివాసరెడ్డిని పెనుగొండకు,తిరుపతి అర్బన్ సీఐ సి. నాగరాజరెడ్డిని జిల్లా టాస్క్‌ఫోర్స్ విభాగానికి ,అక్కడ పనిచేస్తున్న సీఐ హేమంత్‌కుమార్‌ను ఇంటెలిజెన్స్‌కు బదిలీ చేశారు.గుంటూరు-1 ఎస్‌ఈబీ సీఐగా పనిచేస్తున్న ఎం. రమేష్ గూడూరుకు రానుండగా, చీరాల సీఐ కె. సోమయ్య సూళ్లూరుపేటకు, గిద్దలూరు సీఐ ఇ.అరుణ కుమారి నాయుడుపేటకు,క్రోసూరు సీఐ కె. వినయ్‌కుమార్ వెంకటగిరికి బదిలీపై రానున్నారు.

ఎస్‌ఐల బదిలీ

తిరుపతి అర్బన్ ఎస్‌ఐ కె. సుబ్రమణ్యం కడప జిల్లా ఎర్రగుంట్లకు, తిరుపతి రూరల్ ఎస్‌ఐ ఎ.భాస్కర్ అన్నమయ్య జిల్లా కోడూరుకు, చంద్రగిరి ఎస్‌ఐ బి. చైతన్య చిత్తూరు జిల్లా పులిచెర్లకు, పుత్తూరు ఎస్‌ఐ ఎ. నాగరాజు కార్వేటి నగరానికి బదిలీ అయ్యారు. శ్రీకాళహస్తి ఎస్‌ఐ బి. మోహన్‌కృష్ణ నంద్యాల జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు, తిరుమల ఎస్‌ఐ ఎం. రమణ కడప జిల్లా ఎస్‌ఈబీ ఇంటెలిజెన్స్‌కు, తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ పీవీ నరసింహులు నంద్యాల జిల్లా కోవెలకుంట్లకు బదిలీ అయ్యారు. తిరుపతి ఇంటెలిజెన్స్ ఎస్‌ఐ ఎం. మురళి రాయచోటికి , గూడూరు డివిజన్ బీవీ పాళెం చెక్‌పోస్టులో పనిచేస్తున్న ఎస్‌ఐ ఎస్. మోజెస్ గూడూరుకు బదిలీ అయ్యారు.జిల్లాయేతర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఏడుగురు ఎస్‌ఐలు బదిలీపై గూడూరు డివిజన్‌కు రానున్నారు. మాచెర్ల ఎస్‌ఐ ఎం. జయరావు వాకాడుకు, పొందుగుల చెక్‌పోస్టు ఎస్‌ఐలు సోమ ఆంజనేయులు సూళ్లూరుపేటకు, పి. మహబూబ్‌వలి వెంకటగిరికి, ఒంగోలు ఇంటెలిజెన్స్ విభాగం ఎస్‌ఐ ఎస్. మునీర్ అహ్మద్ నాయుడుపేటకు నెల్లూరు జిల్లా కోవూరు ఎస్‌ఐ తలుపుల శ్రీనివాసులు, బుచ్చిరెడ్డి పాళెం ఎస్‌ఐ ఎం. అంజయ్య, కావలి ఎస్‌ఐ డి. శ్రీధర్ బీవీ పాళెం చెక్‌పోస్టుకు బదిలీ అయ్యారు.

తొండవాడలో పంచాయతీరాజ్ బృందం


సమావేశంలో ప్రసంగిస్తున్న ఆనంద్

చంద్రగిరి, జనవరి 20: చంద్రగిరి మండలం తొండవాడ పంచాయతీలో కేంద్రం బృందం శనివారం పర్యటించింది. సచివాలయ వ్యవస్థ, హెల్తీ విలేజ్ అమలుపై మూడు రోజుల వర్క్‌షాపులో భాగంగా శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి చత్తీస్‌ఘడ్, జమ్ముకశ్మీర్, పంజాబ్, హర్యానా, రాజస్థాన్, కేరళ, పుదుచ్చేరిల నుంచి పంచాయతీరాజ్ అధికారులు, ప్రజాప్రతినిధులు తొండవాడకు వచ్చారు. ఈ సందర్భంగా ఏపీ పంచాయతీ రాజ్ డిప్యూటీ సెక్రటరీ ఆనంద్ మాట్లాడుతూ ఏపీలోని సచివాలయ వ్యవస్థ యావత్ భారతదేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 48 మంది అధికార, ప్రజాప్రతినిధులు సచివాలయ వ్యవస్థ పనితీరు, నాడు-నేడు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, సురక్షిత నీటి సరఫరా, రైతు భరోసా, విలేజ్ క్లీనిక్‌ల సిబ్బందితో చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, ఎంపీడీవో బాలాజీనాయక్, సర్పంచ్ మల్లం దీపికారెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, వైస్ ఎంపీపీ నిరంజన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నస్రీన్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

మానవహారంగా అంగన్వాడీల నిరసన



చంద్రగిరి, జనవరి 20: చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద అంగన్వాడీ వర్కర్లు శనివారం మానవహారం నిర్వహించారు.తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ నినాదాలు చేస్తూ దీక్షా శిబిరం నుంచి టవర్ క్లాక్ వద్దకు చేరుకుని మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లు 40 రోజులపాటు నిరవధిక సమ్మె చేపడుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ, లక్ష్మి, నాగరాజమ్మ, నాగభూషణమ్మ, లీలా, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆమ్‌ఆద్మీని బలోపేతం చేయండి

చంద్రగిరి, జనవరి 20: చంద్రగిరి నియోజకవర్గంలో ఆమ్‌ఆద్మీ పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మునినాయుడు పిలుపునిచ్చారు. శనివారం చంద్రగిరిలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చంద్రగిరి టవర్ క్లాక్ నుంచి వైఎస్‌ఎంఆర్ కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి ఐరాల లోకేష్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ సమావేశం ఏర్పాటు చేశారు.రాష్ట్ర అధ్యక్షుడు సిరా రమేష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటాచలపతి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు నీరుగట్టు నగేష్, ఆర్కేపట్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి బాలసుబ్రమణ్యం, రాష్ట్ర అధికార ప్రతినిధి చందు జగదీష్, నందిని, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు పెరటి కోళ్ల పంపిణీ

పాకాల, జనవరి 20: మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు శనివారం పెరటి కోళ్లను పంపిణీ చేశారు. దామలచెరువు, మొగరాల, పదిపుట్లబైలులలో ఒక్కో యూనిట్‌కు 11 కోడిపిల్లలు చొప్పున వంద యూనిట్లకు అందజేశారు. జడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి మాట్లాడుతూ మహిళలు పెరటి కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం సంపాదించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం కోమలాదేవి, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

22న కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు

పాకాల, జనవరి 20: ఈనెల 22వ తేదీన అయోధ్య రామమందిరంలో బాలరాముడు ప్రతిష్ఠను పురస్కరించుకుని ఆ రోజు రైల్వే కాలనీలోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆనందగిరి ఆలయ కమిటీ ఛైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి, అర్చకులు మురళీస్వామి తెలిపారు. ఉదయం 8 గంటలకు అభిషేకం, ప్రత్యేక పూజలు, 11 గంటలకు భజన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఆంజనేయ ఆలయంలో సేవా తీర్థ

తిరుపతి రూరల్, జనవరి 20: చెర్లోపల్లెలోని ఆంజనేయస్వామి ఆలయంలో సేవా తీర్థ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడసాని పురుషోత్తం నాయుడు ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. నాయకులు దుగ్గాని జయరాం, ఇజయకుమార్, హేమాద్రినాయుడు, మురళి, చక్రధరాచార్యులు, విశ్వనాథం హనుమంతరావు, మునిలక్ష్మి, వెంకట్‌రెడ్డి, విజయరామానాయుడు, గోపీనాథ్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, ప్రభాకరనాయుడు పాల్గొన్నారు.

ఎస్వీబీసీలో అయోధ్య కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారం

తిరుమల, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : అయోధ్య శ్రీరామ మందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన 22వ తేదీ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగనుంది. టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవేంకటేశ్వర భక్తిఛానల్ (ఎస్వీబీసీ) తమిళం, కన్నడ, హిందీ ఛానళ్లలో, అలాగే ఎస్వీబీసీ తెలుగు యూట్యూబ్ ఛానల్ ద్వారా అయోధ్యలో జరిగే వైదిక, ఆధ్యాత్మిక క్రతువులను నిరంతరాయంగా ప్రత్యక్షప్రసారం చేయనుంది. ఎస్వీబీసీ తెలుగు ఛానల్‌లో మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి. 12 గంటల నుంచి తిరుమల శ్రీవారి కల్యాణోత్సవం యథావిధిగా ప్రత్యక్షప్రసారం కానుంది. ఆ తర్వాత అయోధ్యలో జరిగే కార్యక్రమాలను ప్రసారం చేస్తారు. కాగా, అయోధ్యలో భక్తులకు ఉచితంగా అందించేందుకు తయారు చేసిన లక్ష చిన్న లడ్డూలను శనివారం ప్రత్యేక విమానంలో అయోధ్యకు తరలించారు.

3నుంచి తిరుమలలో ధార్మిక సదస్సు

● హాజరుకానున్న పీఠాధి, మఠాధిపతులు

తిరుమల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు మూడురోజుల పాటు తిరుమలలోని ఆస్థానమండపంలో శ్రీవేంకటేశ్వర ధార్మిక సదస్సు జరుగనుంది. దేశవ్యాప్తంగా ఉన్న మఠాలు, పీఠాలకు చెందిన స్వామీజీలతో పాటు భావసారూప్యం గల సంస్థల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు.హిందూ ధర్మప్రచారం, పరిరక్షణ వంటి అంశాలపై సదస్సులో చర్చించనున్నారు.

అవయదానంపై అవగాహన అవసరం


సదస్సులో మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి సిటీ, జనవరి 20 : ప్రాణం పోయే సమయంలో అవయవదానం చేస్తే మరో నలుగురి ప్రాణం నిలబెట్టే అవకాశం లభిస్తుందని, ఇలా చేయాలంటే మొదట అవయవదానంపై అవగాహన అవసరమని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ అన్నారు. సంకల్ప సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన అవయవదానంపై అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండు రోజుల క్రితం స్విమ్స్‌లో హేమకుమార్ అనే యువకుడి అవయవాలను దానం చేయడం వలన అవసరమైన వారికి అందించి వారి ప్రాణాలు నిలబెట్టినట్లు చెప్పారు. అవయవదానం శాస్త్రాలకు విరుద్ధం అనే అపోహల నుంచి బయటకు రావాలన్నారు. ఒకప్పుడు మహా నగరాల్లో మాత్రమే చేసే అవయవదానాల శస్త్ర చికిత్స ఇప్పుడు మన తిరుపతిలోనే అందుబాటులో ఉందన్నారు. శ్వేతా మాజీ డైరెక్టర్ భూమన్ మాట్లాడుతూ మనం మరణించినా అవయవదానం చేయడం వలన మరో నలుగురిలో బతికే ఉంటామనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంకల్ప ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ బండ్ల నాగేశ్వర్, ఎండీ నాగరాజు కుమార్, డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, డాక్టర్లు శ్రీహరిరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

10మంది జనసేన నాయకులకు జోనల్ కమిటీలో చోటు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 20: జనసేన 2024 ఎన్నికల కార్యనిర్వహణ జోనల్ కమిటీలో 10మంది జిల్లా నాయకులకు స్థానం కల్పిస్తూ ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. పవన్ పాల్గొనే కార్యక్రమాలు, సభల నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. రాయలసీమ జోన్ ఒకటిలో జిల్లాకు చెందిన పగడాల మురళి(కన్వీనర్), రాకేష్‌రాయల్, దేవినేని యశ్వంత్, ముక్కు సత్యవంతుడు(కోకన్వీనర్లు), సభ్యులుగా పూలప్రభాకర్, చైతన్యరాయల్, కొట్టె సాయి, ఎం.మహేష్, ఎం.రమేష్, కొండా రాజమోహన్ నియమితులయ్యారు.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఇసుక కోసం ముళ్ల కంపలకు నిప్పు

చంద్రగిరి, జనవరి 20: తొండవాడ పంచాయతీ అగ్రహారం సమీపంలోని స్వర్ణముఖినది తీరంలో ఇసుకను అక్రమంగా తరలించడానికి గుర్తుతెలియని వ్యక్తులు ముళ్ళ కంపలకు నిప్పంటించారు. శనివారం మధ్యాహ్నం మంటలు ఎగిసి పడుతుంటంతో పక్కనున్న పొలందారులు గుర్తించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక వాహనం వచ్చి స్వర్ణముఖినదిలో మంటలను అదుపు చేసింది. స్వర్ణముఖినదిలో అనేక దారులు ఏర్పాటు చేసుకుని అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

పుస్తకాల పండుగొచ్చింది


పల్లకిలో పుస్తకాల ఊరేగింపు

తిరుపతి (కల్చరల్), జనవరి 20: తిరుపతి నగరానికి మరో మారు పుస్తకాల పండుగొచ్చింది.భారతీయ విద్యాభవన్ ఏటా నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శన 16వ సారి శనివారం మొదలైంది.ఇస్కాన్ ఆలయం పక్కనున్న వినాయకనగర్ మైదానంలో సుమారు వందకు పైగా బుక్ స్టాళ్లతో, వేలాది అంశాలకు సంబంధించిన పుస్తకాలతో కొలువుదీరింది. పేరొందిన ప్రచురణ సంస్థలు విశాలాంధ్ర, నవయుగ, ఎమెస్కో, ప్రజాశక్తి, విజయవాణి ప్రింటర్స్, భారతీయ విద్యాభవన్ , రామకృష్ణ మిషన్, టీటీడీ, వావిళ్ల తదితర సంస్థలు ఎన్నో కొత్త, పాత పుస్తకాలతో అలరించడానికి సిద్ధమైనాయి. కాల్పనిక సాహిత్యం నుండి పిల్లలకు అవసరమైన కామిక్స్, కథలు, రంగులు నింపే పుస్తకాలు, ఆంగ్ల సాహిత్యం, సంస్కృతం, హిందీ పుస్తకాలు, వేదాల నుంచి పురాణాలు, ఇతిహాసాలు, భారతీయ జీవన విధానం, పూజాదికాలు, తోట పని, వంటా వార్పు, ఆరోగ్య సూత్రాలు, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి పుస్తకాలు, నిఘంటువులు, విద్యార్థులకు ఉపకరించే వార్షిక సమాచార సంచికలు వంటి అనేక అంశాలలో పుస్తకాలు ఇక్కడ లభిస్తాయి. అనువాద సాహిత్యం, అరుదైన అంశాలకు సంబంధించిన ఆయుర్వేదం, జ్యోతిష్యం వంటి అంశాలకు సంబంధించినవి దొరుకుతాయి.శనివారం సాయంత్రం పల్లకిలో పుస్తకాల ఊరేగింపుతో ఈ ప్రదర్శన ప్రారంభమైంది. వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి జ్యోతి వెలిగించి సభను ప్రారంభించారు.నిరంతరం అధ్యయనం చేయడం మనిషికి ఎంతో అవసరమన్నారు. ఎంత ఎక్కువగా చదువుకుంటే అంతగా మనసు వికసిస్తుందన్నారు. పుస్తకాల వలన లోకజ్ఞానం అలవడుతుందన్నారు.సభాధ్యక్షులు, భారతీయ విద్యాభవన్ సంచాలకులు డాక్టర్ నడింపల్లి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ తిరుపతి నేడు మహా నగరంగా విస్తరిస్తోందనీ, నగర ప్రజలకు అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో ఏటా పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. వ్యక్తి జీవితంలో గురువు ఎంతో ప్రభావం కలిగిస్తారని, అందువలన గురువులుగా మంచి పేరు సంపాదించుకోవడానికి పెద్ద వారుకూడా నిత్యం చదువుతూ ఉండాలన్నారు.విశిష్ట అతిథులు ఎస్వీ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య పి. మురళి, తిరుపతి ఐఐటీ ఆచార్యులు ఎ. రఘురామరాజు మాట్లాడుతూ ఏ కాలంలో అయినా మంచి పుస్తకం మంచి స్నేహితుడిలాగా దారిచూపుతుందన్నారు.సభకు ఆచార్య దక్షిణామూర్తి శర్మ స్వాగతం పలుకగా, తోట వెంకటేశ్వర్లు వందన సమర్పణ చేశారు. భారతీయ విద్యాభవన్ విద్యార్థులు సంగీత కచేరి నిర్వహించారు. పుస్తక ప్రదర్శన జనవరి 28 వ తేదీ వరకు రోజూ మధ్యాహ్నం ఒంటిగంట నుంచిరాత్రి 9 గంటల వరకు జరుగుతుంది. సాయంత్రం 3 గంటల నుండి 6 గంటల వరకు సంగీత, సాహిత్య కార్యక్రమాలు, విద్యార్థులకు క్విజ్, రచన, వక్తృత్వం వంటి వాటిలో పోటీలు నిర్వహిస్తారు. ఆసక్తి కలిగిన వారు తమను ప్రభావితం చేసిన మంచి పుస్తకం గురించి కూడా నిర్వాహకుల అనుమతితో క్లుప్తంగా ప్రసంగించవచ్చు.


పుస్తకాలను పరిశీలిస్తున్న ప్రదర్శన ప్రారంభకులు వేద వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి, నిర్వాహకులు సత్యనారాయణ రాజు





కోలాహలంగా హనుమాన్ శోభాయాత్ర

● జై హనుమాన్ నినాదాలతో మార్మోగిన తిరువీధులు

తిరుపతి (కల్చరల్), జనవరి 20: తిరుపతిలో శనివారం సాయంత్రం హనుమాన్ శోభాయాత్ర కోలాహలంగా సాగింది. జనవరి 14వ తేదీ నుంచి రామచంద్ర పుష్కరిణి వద్ద టీటీడీ సహకారంతో హనుమాన్ దీక్షా పీఠం నిర్వహిస్తున్న కోటి హనుమాన్ చాలీసా పారాయణలో భాగంగా భారీ ప్రదర్శన నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వామీజీలు, భక్తులు, పౌరాణిక వేషధారులతో సందడి వాతావరణం నెలకొంది. ఆదివారం తారకరామ స్టేడియంలో నిర్వహించనున్న కోటి హనుమాన్ చాలీసా మహాయజ్ఞ పారాయణ సంకల్పానికి సన్నాహక ప్రయత్నంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సంకల్ప దీక్ష జరుగుతుంది.

ఇకపై ఎంప్లాయిమెంట్ సేవలు ఆన్‌లైన్‌లోనే..


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 20: ఇకమీదట ఎంప్లాయిమెంట్ సేవలు ఆన్‌లైన్‌లో పొందవచ్చునని, ఈ మేరకు భారత ప్రభుత్వం నేషనల్ కెరీర్ సర్వీస్(ఎన్‌సీఎస్) పోర్టల్‌ను ఆన్‌లైన్‌లో అనుసంధానించిందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. దీనికి సంబంధించిన పోస్టరును శనివారం ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, అదనపు అర్హతల నమోదు సులభ రీతిన ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తర్వాత లాగిన్ వివరాలు, తాత్కాలిక రిజిస్ట్రేషన్ నంబరు వెంటనే ఎస్‌ఎంఎస్ ద్వారా మొబైల్‌కు వస్తుందని తెలిపారు. ఎంప్లాయిమెంట్ కార్డును లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు. సందేహాలకు 9441460041ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచలకిషోర్, సబ్ ఎంప్లాయిమెంట్ అధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి డీటీవోగా ఆదినారాయణ బాధ్యతల స్వీకరణ

ప్రమోషన్‌పై బదిలీ అయిన సీతారామిరెడ్డి



తిరుపతి (రవాణా), జనవరి 20: తిరుపతి జిల్లా ఇన్‌చార్జి రవాణా శాఖ అధికారిగా ఆదినారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీటీవోగా విధులు నిర్వహించిన సీతారామిరెడ్డి ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు. గూడూరు ఆర్టీవోగా పనిచేస్తున్న ఆదినారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

రవాణా శాఖలో సీతారామిరెడ్డి తనదైన ముద్ర

తిరుపతి జిల్లా రవాణా శాఖలో సీతారామిరెడ్డి తనదైన ముద్ర వేశారు. విధి నిర్వహణలో కచ్చితంగా వ్యవహరించేవారు. తిరుపతిలో ప్రోటోకాల్ డ్యూటీలు ఎక్కువగా ఉన్నప్పటికీ సమయపాలన పాటించేవారు. ఆయనకు కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు సుబ్రహ్మణ్యం, కుసుమ, స్వర్ణలత, ఏవోలు విజయ ప్రశాంతి, శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్‌లు యువకిషోర్, సునీత, జూనియర్ అసిస్టెంట్లు కుమార్, చరణ్, కానిస్టేబుల్ యేసు, జనార్దన్ పాల్గొన్నారు.

సీఎం మొండి వైఖరి వీడాలి



ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పూర్ణకుంభం సర్కిల్ వద్ద అంగన్వాడీలు, కార్మిక సంఘాల నేతల రాస్తారోకో

● అంగన్వాడీల రాస్తారోకో

తిరుపతి (రవాణా), జనవరి 20 : సీఎం వై.ఎస్.జగన్ మొండి వైఖరి వీడి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి కోరారు. సమ్మెలో భాగంగా శనివారం అంగన్వాడీలు ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పూర్ణకుంభం సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టారు. 45 నిమిషాల పాటు వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు వారికి మద్దతుగా నిలిచారు. కందారపు మురళి మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందన్నారు. అధికారుల ద్వారా నోటీసులు జారీ చేస్తూ బెదిరింపు చర్యలకు పాల్పడుతోందని, ఇలాంటి వాటికి భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాను మహిళా పక్షపాతిని అని చెప్పుకునే ముఖ్యమంత్రి వారిపట్ల వ్యవహరిస్తున్న తీరు బాధాకరమన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో గుణపాఠం నేర్పుతామని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఐఎఫ్‌టీయూ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు నాగరాజమ్మ, అరుణ మాట్లాడుతూ ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించి వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు సుబ్రహ్మణ్యం, బుజ్జి, తంజావూరు మురళి, రవి, జయచంద్ర, సాయిలక్ష్మి, హేమలత, అక్బర్, చిన్నా, ఎన్‌డీ శ్రీనివాసులు, రాధాకృష్ణ, బాలాజీ, త్యాగరాజు, పార్థసారథి, రమేష్, శాంతి, సుందరం, వాసు, శేషయ్య, రఘు, ముత్తు, రవి, గురవయ్య, ఏఐటీయూసీ నాయకులు ఎన్‌డీ రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో మినీ చేనేత మేళా



తిరుచానూరు, జనవరి 20: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో మినీ చేనేత, హస్తకళల మేళా శనివారం నుంచి ప్రారంభమైంది. 15రోజులపాటు జరిగే ఈ మేళాలో వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన 20మంది కళాకారులు తమ ఉత్పత్తులను అమ్మకం కోసం అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా జైపూర్ నుంచి బెడ్‌షీట్స్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన చెక్కతో తయారుచేసిన గృహ అలంకరణ వస్తువులు, కలంకారీ చీరలు, మీరట్ నుంచి వచ్చిన చెప్పులు, మన రాష్ట్రానికి చెందిన కొండపల్లి బొమ్మలు, కడప చేనేత టవల్స్ కాటర్‌పర్స్, ఖాదీటాప్, షోలాపూర్ చెప్పులు, హైదరాబాద్‌కు చెందిన ప్రింటెడ్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్ వంటివి అందుబాటులో ఉంచారు.

జీవన వాస్తవికతను చిత్రించిన సీమ నవల

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఆచార్య చంద్రశేఖర్ రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 20: మానవ జీవన వాస్తవికతను రాయలసీమ నవలా సాహిత్యం అద్భుతంగా చిత్రించిందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్వీయూ తెలుగు విభాగంలో శనివారం తల్లం పుల్లన్నగుప్త ధర్మనిధి సదస్సులో ఆయన మాట్లాడారు. రాయలసీమ నవలల్లో వ్యాపార ధోరణి లేదన్నారు. సామాజిక జీవనం బాగా ప్రతిఫలిస్తూ ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రాంతీయ సాహిత్య అధ్యయనంలో తెలంగాణ ముందు వరుసలో ఉందన్నారు. కొంత ఆలస్యంగానైనా రాయలసీమ సాహిత్యంపై పరిశోధన మొదలైందన్నారు. తొలి తెలుగు నవల శ్రీరంగరాజ చరిత్ర సీమ నుంచే వచ్చిందన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే యాభైకి పైగా నవలలు ఈ ప్రాంతం నుంచి వెలువడ్డాయన్నారు. తొలి తెలుగు నవలా రచయిత్రి దేవమణి సత్యనాథన్ సీమ ప్రాంతానికి చెందిన వారేనని పరిశోధకులు గుర్తించారని చెప్పారు. ఆద్యంతమూ సీమ నవల సమాజాన్ని అంటిపెట్టుకుని నడుస్తూ ఉందన్నారు. ముద్ర, శప్తభూమి, పెన్నేటి మలుపులు, కొండపొలం నవలు సీమ జీవన శకలాలని అన్నారు. సభా, రాజారాం, ఇనాక్, రాసాని, నరేంద్ర, నామిని సుబ్రమణ్యం నాయుడు, బండి నారాయణస్వామి, శాంతి నారాయణ గొప్ప నవలా రచయితలైనప్పటికీ తగినంత గుర్తింపు రాలేదన్నారు. ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి దంపతులను రిజిస్ట్రార్ హుస్సేన్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి రాజేశ్వరమ్మ, సలహాదారు పేట శ్రీనివాసులురెడ్డి, మేడిపల్లి రవికుమార్, కోసూరి దామోదరనాయుడు, కె.మునిరత్నం, ఉగ్రాణం చంద్రశేఖర్‌రెడ్డి, కాటూరి శారద, భక్తవత్సలరెడ్డి, తమటం రామచంద్రారెడ్డి, వీఆర్ రాసాని, వర్సిటీ మీడియా కో-ఆర్డినేటర్ పీసీ వేంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటలను ఈక్రాప్‌లో నమోదు చేసుకోవాలి

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్‌రావు



తిరుపతి(కలెక్టరేట్), జనవరి 20 : రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈక్రాప్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి ప్రసాదరావు కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీ పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవడమేగాక ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. మిచౌంగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీతో వరి విత్తనాలను సరఫరా చేశామని, పంట నష్టపరిహారాన్ని త్వరలోనే అందజేస్తామని చెప్పారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని తెలిపారు. ఆర్‌బీకేలో అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులకు వారి ఇంటి వద్దకే సరఫరా చేస్తామని వివరించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి మాట్లాడుతూ అయిల్‌ఫాం సాగుపై ఆసక్తి గల రైతులు ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలన్నారు. జిల్లా ఏపీఎంఐపీ అధికారి సతీష్ మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. జిల్లా పట్టు పరిశ్రమ శాఖాధికారి గీతారాణి మాట్లాడుతూ కొత్తగా మల్బరీ సాగు చేపట్టే రైతులకు షెడ్ నిర్మాణానికి, నర్సరీకి సబ్సిడీ ఇస్తున్నామని, కావాల్సిన వారు సంప్రదించాలని కోరారు. జిల్లా నీటిపారుదల శాఖ అధికారి వెంకటరమణ, విద్యుత్ శాఖ అధికారి ఈఈ రవిచంద్ర, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త కృష్ణారెడ్డి, రైతు సంఘాల సభ్యుడు గంగాధరం, శేషురెడ్డి మాట్లాడారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు


సప్తగిరి


సుమ, రోషన్


ఎన్వీ బద్రినాథ్


బ్రహ్మానందం

తిరుమల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ మెంబర్ ఎన్వీ బద్రినాథ్, ప్రముఖ సినీ హాస్యనటులు బ్రహ్మానందం, సప్తగిరి, ప్రముఖ యాంకర్ సుమా, ఆమె కుమారుడు హీరో రోషణ్, గాయని సునీత, సీరియల్ నటి రీతు చౌదరి ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం యాంకర్ సుమా మీడియాతో మాట్లాడుతూ తన కుమారుడు రోషన్‌కు స్వామి ఆశీస్సులు కావాలని కోరుకున్నట్టు తెలిపారు. హీరో రోషన్ మాట్లాడుతూ ప్రస్తుతం కథలు వింటున్నానని, త్వరలో నూతన సినిమాను ప్రకటిస్తామని అన్నారు.


రీతు చౌదరి

- నా కుమారుడి నటన బాగుందని ప్రశంసిస్తున్నారు

తన కుమారుడు ఆకాష్ నటన బాగుందని అందరూ ప్రశంసిస్తుంటే చాలా సంతోషంగా ఉందని గాయని సునీత అన్నారు. దర్శనం తర్వాత ఆలయం ముందు ఆమె మీడియాతో మట్లాడుతూ సర్కారు నౌకరి చిత్రంలో ఆకాష్‌తో పాటు భావన అద్భుతంగా నటించారన్నారు. స్వామి దర్శనం సంతృప్తినిచ్చిందన్నారు.


సునీత

అనువాదం కత్తిమీద సాములాంటిది

సిరారంగులు పుస్తకావిష్కరణలో వక్తలు



తిరుపతి (కల్చరల్), జనవరి 20 : ఒక భాషా సాహిత్యాన్ని మరో భాషలోకి అనువాదం చేయడం కత్తిమీద సామువంటిదని వక్తలు అభిప్రాయపడ్డారు. హిందీలో అభిషేక్ సింహ్ రాసిన కవితలను తెలుగులో ఆకాశవాణి విశ్రాంత అధికారి ఆకుల మల్లేశ్వరరావు సిరా రంగులు పేరుతో అనువదించారు. ఈ పుస్తకం ఆవిష్కరణ సభ శనివారం సాయంత్రం బైరాగి పట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరిగింది. దీనికి డాక్టర్ నాదెళ్ల శ్రీమన్నారాయణ అధ్యక్షత వహించారు. గంగవరపు శ్రీదేవి పుస్తకావిష్కరణ చేశారు. డాక్టర్ గాలి గుణశేఖర్ మాట్లాడుతూ మూల రచనలోని అంశాలను, భావాలను తెలుగుదనం ప్రతిబింబించే విధంగా చక్కని తేట తెలుగులో చెప్పడం రచయితకు కత్తిమీద సామువంటిదన్నారు. అయితే ఈ పుస్తకం సొంత రచన అన్నంత హాయిగా ఉందన్నారు. రచయిత ఆకుల మల్లేశ్వరరావు హిందీ కవితానుభవాలను సభలో పంచుకున్నారు. ఈ సభలో డాక్టర్ సాకం నాగరాజ, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, యువశ్రీమురళి, టెంకాయల దామోదరం, నడ్డినారాయణ, పేరూరు బాలసుబ్రమణ్యం, తమటం రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

17నుంచి గోవిందరాజస్వామి తెప్పోత్సవాలు

తిరుపతి (కల్చరల్), జనవరి 20: గోవిందరాజస్వామి తెప్పోత్సవాలను ఫిబ్రవరి 17 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు టీటీడీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు తెప్పోత్సవాలు జరుగుతాయని పేర్కొంది. 17వ తేదీన కోదండరామస్వామి వారు పుష్కరిణిలో ఐదుసార్లు తెప్పలపై విహరిస్తారని వివరించింది. హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజక్టు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపింది.

ఇరువర్గాల మధ్య ఘర్షణ : వృద్ధుడికి గాయాలు



తిరుపతి రూరల్, జనవరి 20 : మల్లంగుంట పంచాయతీ అంబేద్కర్ కాలనీలో శనివారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన మురుగయ్య(70) ఇంటిపైకి కొందరు కత్తులతో చొరబడి దాడికి పాల్పడ్డారు. ఆయన తలకు బలమైన గాయమైంది. చుట్టుపక్కల వారు గమనించి బాధితుడిని రుయా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దీనికి సంబంధించి తమకు ఎలాంటి సమాచారమూ అందలేదని తిరుపతి రూరల్ పోలీసులు తెలిపారు.

రేపు ప్రతి ఇంటా పూజలు చేయండి

తిరుపతి(కొర్లగుంట), జనవరి 20: అయోధ్య రామజన్మభూమిలో భవ్య మందిరం ప్రారంభం, బాల రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ ఇత్యాది కార్యక్రమాలు జరుగుతున్న సోమవారం ప్రతి ఇంటా శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించాలని వీహెచ్‌పీ నగర ప్రతినిధులు దిండుకుర్తి నరసింహులు, రమాదేవి కోరారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా అయోధ్య అక్షింతలు, ఆహ్వాన పత్రిక, రామమందిరం చిత్రపటం అందజేశామన్నారు. సోమవారం మధ్యాహ్నం 12.29 గంటలకు శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని, ఆ సమయంలో అంక్షితలను తలపై వేసుకోవాలని సూచించారు. అక్షింతలు అందని వారు 9177186130ను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా కోశాధికారి నాగరాజుశర్మ, సరళ, లలిత, జయరామ్, రవిచంద్ర, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

తిరుపతి(కొర్లగుంట), జనవరి 19 : అలిపిరి ఆర్టీసీ డిపోలో సోమవారం భద్రతా మసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా హాజరైన సీఎంఈ నరసింహులు, డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, ఎంవీఐ కుసుమ మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం డ్రైవింగ్ స్కూల్లో హెవీ మోటార్ వెహికల్ శిక్షణ పూర్తి చేసిన 24వ బ్యాచ్‌కు వీడ్కోలు, 25వ బ్యాచ్‌కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సింగం హరిబాబు, అసిస్టెంట్ మేనేజర్ పుష్పలత, గోపాల్, నాగేశ్వరరావు, టి.రాము తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంకు పీవోగా అదనపు బాధ్యతలు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 20 : సెంట్రల్ బస్టేషన్ ఏటీఎం డి.రామచంద్రనాయుడు శనివారం పర్సనల్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఆ పదవిలో ఉన్న పార్థసారథి అనారోగ్యం కారణంగా సుదీర్ఘ సెలవుపై వెళ్లారు. తిరిగి విధుల్లో చేరే వరకు రామచంద్ర నాయుడు అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు.

అ'పూర్వ' జ్ఞాపకాలు

55 ఏళ్ల తర్వాత కలుసుకున్న ఎస్వీ వైద్య కళాశాల మిత్ర బృందం



తిరుపతి సిటీ, జనవరి 20 : 55 ఏళ్ల క్రితం చదువుకున్న అందరూ ఒక్కటై ఆ నాటి జ్ఞాపకాలను, వారి అనుభవాలను పంచుకోవడం ఎనిమిది పదుల వయస్సులో ఎంతో ఆనందాన్ని ఇస్తుందని సీనియర్ డాక్టర్లు, సమన్వయకర్తలు డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ భాస్కర్ నాయుడు అన్నారు. స్థానిక ఎస్వీ వైద్య కళాశాలకు చెందిన 1968 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులు శనివారం నగరంలోని ఓ హోటల్లో ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశవిదేశాల్లో స్థిరపడిన ఎంతో మంది పాల్గొన్నారు. కళాశాలలో చదివే రోజుల్లో వారి మధుర జ్ఞాపకాలను, గురువులను గుర్తు చేసుకున్నారు. ఒక్కొక్కరుగా వేదికపైకి వచ్చి జీవితంలో సాధించిన విజయాలను, అనుభవాలను, కుటుంబ సభ్యుల వివరాలను పంచుకున్నారు. ఈ ఆనందం మరింత ఆయుష్షును పెంచుతుందని డాక్టర్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ రోజులు మళ్లీ వస్తే బాగుంటుందని డాక్టర్ భాస్కర్‌నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో 60 మందికి పైగా పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.39 కోట్లు

తిరుమల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.39 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 69,874 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 26,034 మంది తలనీలాలు సమర్పించారు.

మెకానిక్ కుటుంబానికి సాయం


రమేష్ కుటుంబానికి సాయం అందజేస్తున్న మునిరెడ్డి

తిరుపతి (రవాణా), జనవరి 20: ప్రమాదంలో మృతి చెందిన మెకానిక్ రమేష్ కుటుంబానికి తిరుపతి జిల్లా టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి, అసోసియేషన్ సభ్యులు, నేతలు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పథకాలను కూడా అందజేస్తామన్నారు. శనివారం గాంధీ భవన్‌లో అసోసియేషన్ నెలవారీ సమావేశం నిర్వహించారు. ఎయిర్ బైపాస్ రోడ్డులోని అమెరికన్ ఆస్పత్రి యాజమాన్యం సహాయ సహకారాలతో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి, పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు లక్ష్మణరావు, ప్రభు, జలంధర్, బాబు, సోము, గురు, కుమార్, ముక్బుల్ పాల్గొన్నారు.

నేడు అయోధ్యకాండ అఖండ పారాయణం

తిరుమల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల నాదనీరాజనం వేదికపై ఆదివారం 6వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు జరుగనున్న ఈ కార్యక్రమంలో అయోధ్యకాండలోని 18 నుంచి 21వ సర్గల వరకు 199 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 224 శ్లోకాలను పారాయణం చేస్తారు. ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారం చేయనున్న ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని టీటీడీ కోరింది.

భళా.. భువనిక

మేధస్సుతో పలు రికార్డులు సొంతం


శ్లోకాలు ఆలపిస్తున్న భువనిక

తిరుపతి (విద్య), (తిలక్‌రోడ్), జనవరి 20 : తిరుపతికి చెందిన కవిత, భరత్‌కుమార్ దంపతుల కుమార్తె భువనిక (5సంవత్సరాల 6నెలలు)అతి చిన్న వయసులోనే అద్భుతాలు ప్రదర్శిస్తోంది. రామాయణం, మహాభారతంలోని పలు శ్లోకాలు, శ్రీరాముడి వంశానికి చెందిన 42మంది రాజుల పేర్లు, 25భగవద్గీత శ్లోకాలు, అన్నమయ్య కీర్తనలు, భక్తిపాటలు, ఇండియాలోని రాష్ట్రాలు వాటి రాజధానుల పేర్లు, జాతీయగీతం, ప్రతిజ్ఞ, ఇండియన్ సింబల్స్ వంటివి అలవోకగా చెబుతోంది. ఇటీవల వైజాగ్‌లో వందేభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటో ఎగ్జిబిషన్‌లో భువనిక ప్రతిభను మెచ్చి టాలెంట్ విభాగంలో భీష్మ వశిష్ట పురస్కారాన్ని అందించారు. అలాగే ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్‌లలో చోటు సంపాదించింది. వారు అప్రిసియేషన్ ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈ చిన్నారి అక్కారంపల్లెలోని ఫ్యూచర్ ఆన్ ప్రీస్కూల్‌లో యూకేజీ చదువుతోంది. స్కూలు హెడ్ స్వర్ణలత, తల్లి కవితతో కలిసి భువనిక శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియా ముందు తాను నేర్చుకున్న శ్లోకాలు, రాముని వంశవృక్ష చరిత్ర, అన్నమయ్య సంకీర్తనలను ఆలపించింది. స్వర్ణలత మాట్లాడుతూ తమ పాఠశాలలో చిన్నారులకు భారతీయ సనాతన గ్రంథాలు, మంచి నడవడిక నేర్పే క్రమంలో భువనికలో ఉన్న సృజనాత్మకతను గుర్తించి మరింత తర్ఫీదు అందించామన్నారు. ఫలితంగా ఆమె తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో వందేభారత్‌భీష్మ టాలెంట్‌కిడ్ అవార్డులను దక్కించుకుందన్నారు.

నేటి నుంచి జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, డీటీవోలు ఆదినారాయణ, సీతారామిరెడ్డి

తిరుపతి (రవాణా), జనవరి 20: రవాణా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. ఇన్‌చార్జి రవాణా శాఖాధికారి ఆదినారాయణ మాట్లాడుతూ మాసోత్సవాలలో భాగంగా డ్రైవర్లు, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీవో సీతారామిరెడ్డి, ఎంవీఐ శ్రీనివాసరావు, ఏఎంవీఐ స్వర్ణలత పాల్గొన్నారు.

తిరుపతి

దొంగ ఓట్లతో గెలిచిన ఎంపీని బర్తరఫ్ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రజనీకాంత్ నాయుడు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 20 : దొంగ ఓట్లతో గెలిచిన వైసీపీ ఎంపీని బర్తరఫ్ చేయాలని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్ నాయుడు డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో 35వేల దొంగ ఓట్లు సృష్టించిన విషయాన్ని ఈసీ నిర్ధారించుకుని అప్పటి కమిషనర్ గిరీషాను సస్పెండ్ చేయడం మంచి పరిణామమన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న గిరీషాను వైసీపీ ప్రభుత్వం బలి పశువును చేసిందని విమర్శించారు. దొంగ ఓట్ల ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ అధికారులపై ఒత్తిడి తెచ్చిన ప్రజాప్రతినిధుల పేర్లను ఈసీ వెల్లడించి, వారిని శాశ్వతంగా ఎన్నికల్లో పోటీ చేయకుండా చేయాలని డిమాండ్ చేశారు. అప్పట్లో ఫిర్యాదు చేసినా ఒకరూ పట్టించుకోలేదని, మూడేళ్ల తర్వాత నగరపాలకసంస్థ కమిషనర్ హరిత ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లపై నెపం మోపి అసలు సూత్రధారులను తప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. చంద్రగిరి నియోజకవర్గంలో లక్ష పైచిలుకు దొంగ ఓట్లపై ఆధారాలతో పాటు టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అప్పటి ఆర్డీవో కనకనరసారెడ్డి నాని సతీమణి సుధారెడ్డిని అవహేళనగా మాట్లాడుతూ అవమానించారని గుర్తు చేశారు. దొంగ ఓట్ల వ్యవహారంతో ప్రమేయమున్న అధికారులు, ప్రజా ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతి, చంద్రగిరిలో ఎక్కించిన బోగస్ ఓట్లను తొలగించకుంటే కలెక్టరేట్‌ను, నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు శ్రీనివాస్‌యాదవ్, దినేష్, వెంకటేష్, లోకేష్, అన్నామలై పాల్గొన్నారు.

దొంగ ఓట్లకు కేరాఫ్‌గా తిరుపతి, చంద్రగిరి

తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నిరసన


నిరసన తెలుపుతున్న తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నేతలు

తిరుపతి, జనవరి20(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో బోగస్ ఓట్ల కుంభకోణంపై వినూత్నరీతిలో నిరసన తెలిపారు. దొంగ ఓట్ల జాబితాను తోపుడు బండిపై కుప్పలుగా పోసి ఎన్నికల సంఘం మరింత వేగవంతంగా స్పందించాలంటూ నిరసన వ్యక్తం చేశారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు మాట్లాడుతూ అధికారులను అడ్డం పెట్టుకుని వైసీపీ నేతలు ఉప ఎన్నికతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో చెలరేగిపోయారని ధ్వజమెత్తారు. దాని పర్యవసానం ఇప్పుడు అధికారులు అనుభవిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఆయన తనయుడు అభినయ్ రెడ్డి నేతృత్వంలో బోగస్ ఓట్ల దందా జరిగిందని ఆరోపించారు. పాత్రధారులపై చర్యలు సరే, సూత్రధారులపై చర్యలు ఎప్పుడు తీసుకుంటారని ప్రశ్నించారు. దొంగ ఓట్లకు కేరాఫ్ అడ్రస్‌గా తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాలు నిలిచిపోయాయంటూ మండిపడ్డారు. టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షుడు హేమంత్ రాయల్ మాట్లాడుతూ తిరుపతి మొత్తం దొంగ ఓట్లతో నిండిపోయిందని, ఏ బూత్‌లో చూసినా 300కు పైగా ఫేక్ ఓట్లు ఉన్నాయని అన్నారు. అధికార యంత్రాంగం భూమన కుటుంబానికి తొత్తుగా మారిపోయిందని విమర్శించారు. దొంగ ఓట్లు తొలగించే వరకు కొత్త జాబితా ప్రకటించకూడదని డిమాండు చేశారు. తెలుగు యువత నాయకులు ఆర్పీ శ్రీనివాస్, పెరుమాళ్ మధు పాల్గొన్నారు.

దొంగ ఓట్లను తొలగించాలని ధర్నా


ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జన సైనికులు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 20 : తిరుపతిలో నమోదు చేసిన దొంగ ఓట్లను తొలగించాలని, లేకపోతే కోర్టులను ఆశ్రయించాల్సి వస్తుందని జనసేన నేతలు పసుపులేటి డాక్టర్ హరిప్రసాద్, కిరణ్‌రాయల్, రాజారెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం వారు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. దొంగల రాజ్యం, దోపిడి రాజ్యం అంటూ నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ తిరుపతిలో దాదాపు 40వేల దొంగ ఓట్లు నమోదై ఉన్నాయని, వాటిని తొలగించే వరకు ఓటర్ల తుది జాబితా విడుదలను వాయిదా వేయాలని అన్నారు. ఈ దురాఘతానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్ కార్డుకు ఆధార్ లింకు చేయాలని డిమాండ్ చేశారు. నీతి నిజాయితీగా ఉంటే గెలవలేమని భావించి దొడ్డిదారిన మళ్లీ అధికారంలోకి రావాలనుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. తిరుపతిని దొంగ ఓట్లకు నిలయంగా మార్చేసి, సభ్య సమాజం తలదించుకునేలా చేశారని అన్నారు. నేతల అధికార దాహానికి అధికారులు బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో నిషాంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

నారాయణస్వామికి జీడీ నెల్లూరు టిక్కెట్టు ఇవ్వకుంటే రాజీనామా

- వైసీపీ క్యాడర్ హెచ్చరిక


సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 20 : డిప్యూటీ సీఎం నారాయణస్వామికి జీడీనెల్లూరు ఎమ్మెల్యే టిక్కెట్టు ఇవ్వకుంటే తమ పదవులకు రాజీనామా చేస్తామని వెదురుకుప్పం ప్రజాప్రతినిధులు పార్టీ అధిష్ఠానాన్ని హెచ్చరించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వైసీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ సుకుమార్, ఎంపీటీసీ మురళిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడని చిత్తూరు ఎంపీ రెడ్డెప్పకు జీడీనెల్లూరు ఎమ్మెల్యే టిక్కెట్టు కేటాయించడం సరికాదన్నారు. నారాయణస్వామి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. ఈ నియోజకవర్గంలో దళితులు ఎక్కువ శాతం మంది ఉన్నారని, దాన్ని అధిష్ఠానం పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పెత్తందారుల మాట వినకుండా పేదలకు సేవ చేసినందుకే నారాయణస్వామికి అన్యాయం చేస్తున్నారని, అధిష్ఠానం పునరాలోచించాలని అన్నారు. ఈ సమావేశంలో వైసీపీ మాజీ సర్పంచులు బాలకృష్ణయ్య, దొరస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ విలేజ్‌పై ముగిసిన జాతీయ వర్క్‌షాప్

తిరుపతి సమీప ప్రాంతాల్లో ప్రతినిధుల క్షేత్ర పర్యటన

సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవల పరిశీలన


వైద్య సేవల గురించి తెలుసుకుంటున్న వర్క్‌షాప్ ప్రతినిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 20: హెల్త్ విలేజ్‌పై మూడు రోజులుగా పద్మావతి మహిళా యూనివర్సిటీ వేదికగా చేపట్టిన జాతీయస్థాయి వర్క్‌షాప్ శనివారం ముగిసింది. మూడవ రోజు కార్యక్రమాల్లో భాగంగా వర్క్‌షాప్ ప్రతినిధులు తిరుపతి సమీప గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ నిర్వహణను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. నాలుగు బృందాలుగా విడిపోయిన ప్రతినిధులు చెర్లోపల్లె, తనపల్లె, తొండవాడ, ఎలమండ్యం గ్రామాల్లో పర్యటించారు. ఆరోగ్య, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ గురించి సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పద్మావతి వర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన ముగింపు సభలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సూర్యకుమారి మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ విజయవంతమైందన్నారు. ప్రతినిధుల మధ్య చాలా అర్థవంతమైన చర్చ సాగిందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పింఛన్ల డోర్ డెలివరీ, డీబీటీ విధానాలు బాగున్నాయని ఇతర రాష్ట్రాల ప్రతినిధులు కితాబిచ్చారని చెప్పారు. అనంతరం వర్క్‌షాప్ ప్రతినిధులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు.

ఒత్తిళ్లకు లొంగొద్దు.. నిష్పక్షపాతంగా పనిచేయండి

- పోలీసు అధికారులకు డీఐజీ అమ్మిరెడ్డి దిశానిర్దేశం


డీఐజీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న పీఆర్వో చంద్ర

తిరుపతి(నేరవిభాగం), జనవరి 20: ఎన్నికలు సమీపిస్తున్న వేళ అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఒత్తిళ్లకూ, ప్రలోభాలకూ లొంగకుండా నిష్పక్షపాతంగా పనిచేయాలని అనంతపురం రేంజి డీఐజీ అమ్మిరెడ్డి జిల్లా పోలీసు అధికారులకు సూచించారు. శనివారం తిరుపతికి వచ్చిన ఆయన ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పద్మావతి మహిళా వర్సిటీ సావేరి సమావేశ మందిరంలో పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రానున్న మూడు నెలల కాలం అత్యంత క్లిష్టమైందని, అప్రమత్తంగా ఉండకపోతే అందరం సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. సమస్య ఉత్పన్నమయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పాత నేరస్తులను బైండోవర్ చేయాలని, అమాయక ప్రజలను అనవసరంగా కేసుల్లో ఇరికించరాదని హెచ్చరించారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పక్షపాతంతో వ్యవహరించి, ఎన్నికల సంఘం చర్యలకు గురికావద్దన్నారు. పోలింగ్ బూతుల్లో అక్రమాలు చోటు చేసుకుంటే మౌనంగా ఉండరాదని, నిబంధనలు ఉల్లఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్లను భయపెట్టడం, ప్రలోభాలకు గురిచేయడం లాంటి ఘటనలు జరగకుండా చూసుకోవాలని చెప్పారు. తుపాకుల లైసెన్స్‌లను పరిశీలించి, నిబంధనల ప్రకారం సీజ్ చేసి, పోలీస్‌స్టేషన్లలో డిపాజిట్ చేయించాలన్నారు. అనంతరం జిల్లా పోలీసు శాఖలో కష్టపడి పనిచేసిన వారిని అమ్మిరెడ్డి అభినందించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచినవారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. పోలీసు విభాగం పీఆర్వో చంద్ర ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమలకుమారి, రాజేంద్ర, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆచార్య మూలె విజయలక్ష్మికి గిడుగు జాతీయ పురస్కారం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 20: పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విశ్రాంతాచార్యులు మూలె విజయలక్ష్మి గిడుగు జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు భాషా, సాహిత్య రంగాలకు ఆమె చేసిన కృషికి గుర్తింపుగా గిడుగు ఫౌండేషన్ అవార్డును అందజేయనుంది. ఈ నెల 22వ తేదీ హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. 30 ఏళ్లపాటు యూనివర్సిటీ స్థాయిలో తెలుగు బోధన, పరిశోధనా రంగాల్లో ఆచార్య మూలె విజయలక్ష్మి విశేష కృషి చేశారు. 11 పుస్తకాలు రాశారు. పద్మావతి వర్సిటీ తెలుగు విభాగ బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీఓఎస్) చైర్మన్‌గా, విభాగాధిపతిగా, అకడమిక్ అఫైర్స్ డీన్‌గా, సోషియల్ సైన్స్ డీన్‌గా, అకడమిక్ సెనేట్ మెంబరుగా, హాస్టల్ వార్డెన్‌గా సేవలందించారు. ఏడు పరిశోధనా ప్రాజెక్టులు పూర్తి చేశారు. 28 పీహెచ్‌డీలు, 7 ఎంఫిల్ డిగ్రీలకు పర్యవేక్షకులుగా వ్యవహరించారు.

బస్సుయాత్ర కోసం ట్రాఫిక్ ఆంక్షలు

ఒక్కరోజు ముందే రోడ్ల మూసివేత



ఎల్ఐసీ రోడ్డుకు అడ్డంగా పెట్టిన బ్యారికేడ్లు

నాయుడుపేట టౌన్, జనవరి 20: పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు సామాజిక సాధికారిక బస్సుయాత్ర నిర్వహించేందుకు వైసీపీ నేతలు ఏర్పాట్లు చేపట్టారు. ఇందుకోసం స్థానిక విజయగణపతి దేవాలయం నుంచి పడమటివీధి, టవర్‌క్లాక్ సెంటర్, దర్గారోడ్డు మీదుగా పాత బస్టాండ్ వరకు బస్సుయాత్ర రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేశారు. పాత బస్టాండ్ వద్ద బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. అయితే పోలీసులు అత్యుత్సాహం చూపుతూ శనివారం మధ్యాహ్నమే రోడ్లను బ్లాక్ చేస్తూ ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న రైల్వేస్టేషన్ రోడ్డులోనూ ఆంక్షలు విధించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేని ఎల్ఐసీ రోడ్డును కూడా బ్లాక్ చేయడం విమర్శలకు దారితీసింది.

ఇకపై ఎంప్లాయిమెంట్ సేవలు ఆన్‌లైన్‌లోనే..



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 20: ఇకమీదట ఎంప్లాయిమెంట్ సేవలు ఆన్‌లైన్‌లో పొందవచ్చునని, ఈ మేరకు భారత ప్రభుత్వం నేషనల్ కెరీర్ సర్వీస్(ఎన్‌సీఎస్) పోర్టల్‌ను ఆన్‌లైన్‌లో అనుసంధానించిందని కలెక్టర్ వెంకట రమణారెడ్డి అన్నారు. దీనికి సంబంధించిన పోస్టరును శనివారం ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, అదనపు అర్హతల నమోదు సులభ రీతిన ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తర్వాత లాగిన్ వివరాలు, తాత్కాలిక రిజిస్ట్రేషన్ నంబరు వెంటనే ఎస్ఎంఎస్ ద్వారా మొబైల్‌కు వస్తుందని తెలిపారు. ఎంప్లాయిమెంట్ కార్డును లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు. సందేహాలకు 9441460041ను సంప్రదించాలని కోరారు.కార్యక్రమంలో డీఆర్వో పెంచలకిషోర్, సబ్ ఎంప్లాయిమెంట్ అధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

ఎస్వీబీసీలో అయోధ్య కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారం

తిరుమల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అయోధ్య శ్రీరామ మందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన 22వ తేదీ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగనుంది. టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవేంకటేశ్వర భక్తిఛానల్ (ఎస్వీబీసీ) తమిళం, కన్నడ, హిందీ ఛానళ్లలో, అలాగే ఎస్వీబీసీ తెలుగు యూట్యూబ్ ఛానల్ ద్వారా అయోధ్యలో జరిగే వైదిక, ఆధ్యాత్మిక క్రతువులను నిరంతరాయంగా ప్రత్యక్షప్రసారం చేయనుంది. ఎస్వీబీసీ తెలుగు ఛానల్‌లో మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి. 12 గంటల నుంచి తిరుమల శ్రీవారి కల్యాణోత్సవం యథావిధిగా ప్రత్యక్షప్రసారం కానుంది. ఆ తర్వాత అయోధ్యలో జరిగే కార్యక్రమాలను ప్రసారం చేస్తారు. కాగా, అయోధ్యలో భక్తులకు ఉచితంగా అందించేందుకు తయారు చేసిన లక్ష చిన్న లడ్డూలను శనివారం ప్రత్యేక విమానంలో అయోధ్యకు తరలించారు.

ఇన్‌ఛార్జి డీటీవోగా ఆదినారాయణ బాధ్యతల స్వీకరణ

ప్రమోషన్‌పై బదిలీ అయిన సీతారామిరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆదినారాయణ

తిరుపతి (రవాణా), జనవరి 20: తిరుపతి జిల్లా ఇన్‌చార్జి రవాణా శాఖ అధికారిగా ఆదినారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డీటీవోగా విధులు నిర్వహించిన సీతారామిరెడ్డి ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు. గూడూరు ఆర్టీవోగా పనిచేస్తున్న ఆదినారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

రవాణా శాఖలో సీతారామిరెడ్డి తనదైన ముద్ర

తిరుపతి జిల్లా రవాణా శాఖలో సీతారామిరెడ్డి తనదైన ముద్ర వేశారు. విధి నిర్వహణలో కచ్చితంగా వ్యవహరించేవారు. తిరుపతిలో ప్రోటోకాల్ డ్యూటీలు ఎక్కువగా ఉన్నప్పటికీ సమయపాలన పాటించేవారు. ఆయనకు కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు సుబ్రహ్మణ్యం, కుసుమ, స్వర్ణలత, ఏవోలు విజయ ప్రశాంతి, శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్‌లు యువకిషోర్, సునీత, జూనియర్ అసిస్టెంట్లు కుమార్, చరణ్, కానిస్టేబుల్ యేసు, జనార్దన్ పాల్గొన్నారు.

దొంగ ఓట్లతో గెలిచిన ఎంపీని బర్తరఫ్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రజనీకాంత్ నాయుడు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 20 : దొంగ ఓట్లతో గెలిచిన వైసీపీ ఎంపీని బర్తరఫ్ చేయాలని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్‌నాయుడు డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో 35వేల దొంగ ఓట్లు సృష్టించిన విషయాన్ని ఈసీ నిర్ధారించుకుని అప్పటి కమిషనర్ గిరీషాను సస్పెండ్ చేయడం మంచి పరిణామమన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న గిరీషాను వైసీపీ ప్రభుత్వం బలి పశువును చేసిందని విమర్శించారు. ఈ దొంగ ఓట్ల ఆధారంగానే తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికలు నిర్వహించుకుని అధికారం దక్కించుకున్నారని ఆరోపించారు. దొంగ ఓట్ల ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ అధికారులపై ఒత్తిడి తెచ్చిన ప్రజా ప్రతినిధుల పేర్లను ఈసీ వెల్లడించి, వారిని శాశ్వతంగా ఎన్నికల్లో పోటీ చేయకుండా చేయాలని డిమాండ్ చేశారు. అప్పట్లో ఫిర్యాదు చేసినా ఒకరూ పట్టించుకోలేదని, మూడేళ్ల తర్వాత నగరపాలకసంస్థ కమిషనర్ హరిత ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లపై నెపం మోపి అసలు సూత్రధారులను తప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. చంద్రగిరి నియోజకవర్గంలో లక్ష పైచిలుకు దొంగ ఓట్లపై ఆధారాలతో పాటు టీడీపీ ఇన్‌ఛార్జి పులివర్తి నాని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అప్పటి ఆర్డీవో కనకనరసారెడ్డి నాని సతీమణి సుధారెడ్డిని అవహేళనగా మాట్లాడుతూ అవమానించారని గుర్తు చేశారు. దొంగ ఓట్ల వ్యవహారంతో ప్రమేయమున్న అధికారులు, ప్రజా ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతి, చంద్రగిరిలో ఎక్కించిన బోగస్ ఓట్లను తొలగించకుంటే కలెక్టరేట్‌ను, నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు శ్రీనివాస్‌యాదవ్, దినేష్, వెంకటేష్, లోకేష్, అన్నామలై పాల్గొన్నారు.

10మంది జనసేన నేతలకు జోనల్ కమిటీలో చోటు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 20: జనసేన 2024 ఎన్నికల కార్యనిర్వహణ జోనల్ కమిటీలో 10మంది జిల్లా నాయకులకు స్థానం కల్పిస్తూ ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. పవన్ పాల్గొనే కార్యక్రమాలు, సభల నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. రాయలసీమ జోన్ ఒకటిలో జిల్లాకు చెందిన పగడాల మురళి(కన్వీనర్), రాకేష్‌రాయల్, దేవినేని యశ్వంత్, ముక్కు సత్యవంతుడు(కోకన్వీనర్లు), సభ్యులుగా పూలప్రభాకర్, చైతన్యరాయల్, కొట్టె సాయి, ఎం.మహేష్, ఎం.రమేష్, కొండా రాజమోహన్ నియమితులయ్యారు.

26నుంచి ధర్మప్రచార వారోత్సవాలు

సూళ్లూరుపేట, జనవరి 20: ఆలయాల సంస్కృతి, సంప్రదాయాల వ్యాప్తికోసం దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 1 వరకు తడ, సూళ్లూరుపేటట మండలాల్లో ధర్మప్రచార వారోత్సవాలు జరుగుతాయని చెంగాళమ్మ ఆలయ ఈవో శ్రీనివాసుల రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 26న తడ, 27న మాంబట్టు, 28న మన్నారుపోలూరు, 29న వాటంబేడు, 30న కోటపోలూరు, 31న సూళ్లూరుపేట పట్టణం, ఫిబ్రవరి 1న చెంగాళమ్మ ఆలయంలో జరుగుతుందన్నారు. భక్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

3నుంచి తిరుమలలో ధార్మిక సదస్సు

హాజరుకానున్న పీఠాధి, మఠాధిపతులు

తిరుమల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు మూడురోజుల పాటు తిరుమలలోని ఆస్థానమండపంలో శ్రీవేంకటేశ్వర ధార్మిక సదస్సు జరుగనుంది. దేశవ్యాప్తంగా ఉన్న మఠాలు, పీఠాలకు చెందిన స్వామీజీలతో పాటు భావసారూప్యం గల సంస్థల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు.హిందూ ధర్మప్రచారం, పరిరక్షణ వంటి అంశాలపై సదస్సులో చర్చించనున్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేత

పెళ్లకూరు, జనవరి 20: పెళ్లకూరు మండలంలోని కానూరు గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన బీసీ నేత బత్తల శ్రీనివాసులు టీడీపీలో చేరారు. శనివారం సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు ప్రసాద్ నాయుడు, శేఖర్‌నాయుడు, సుబ్బరామయ్య, వెంకటేశ్వర్లు, గురవయ్య, ప్రసాద్, పరుశురాం, సురేష్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులపై కేంద్రప్రభుత్వ పెత్తనాన్ని వ్యతిరేకిస్తాం

కడియం శ్రీహరి

తిరుమల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వ పెత్తనాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆ పార్టీ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు.నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలనుకోవడాన్ని బీఆర్ఎస్ వ్యతిరేకిస్తోందన్నారు. రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా దీన్ని వ్యతిరేకించాలని కోరారు. ప్రాజెక్టులు కేంద్రం ఆధీనంలోకి వెళ్లిపోతే ప్రతిసారి వాళ్లను అడుక్కోవాల్సిన దుస్థితి వస్తుందని అభిప్రాయపడ్డారు. నదీ జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటా, ఆస్తుల పంపకం, హక్కుల విషయంలో చిత్తశుద్ధితో పోరాడేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమే అన్నారు. రాష్ట్ర హక్కులపై ప్రశ్నించే వారిని మాత్రమే పార్లమెంటుకు పంపాలని తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు.

నేడు అయోధ్యకాండ అఖండ పారాయణం

తిరుమల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల నాదనీరాజనం వేదికపై ఆదివారం 6వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు జరుగనున్న ఈ కార్యక్రమం ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారం చేస్తారని టీటీడీ ఒక ప్రకటనలో పేర్కొంది.

మరో దళిత నిరసన స్వరం

నారాయణస్వామి కావాలి.. రెడ్డెప్ప వద్దంటూ నిరసన నినాదాలు ● మూకుమ్మడిగా రాజీనామా చేస్తామంటూ హెచ్చరికలు

జిల్లాలో మరో దళిత నేత నిరసన స్వరం మొదలైంది. జీడీనెల్లూరు టికెట్ ఇవ్వకపోవడంతో డిప్యూటీ సీఎం నారాయణస్వామి తాను నోరు తెరవకుండానే, తన అనుచరుల ద్వారా అసమ్మతిని ప్రకటిస్తున్నారు. శుక్ర, శనివారాల్లో నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు ప్రెస్‌మీట్లు నిర్వహించారు. జీడీనెల్లూరుకు నారాయణస్వామి కావాలి.. రెడ్డెప్ప వద్దు.. అంటూ ప్రకటించారు. ఒకవేళ నారాయణస్వామికి టికెట్ ఇవ్వకుంటే అన్ని పదవులకు రాజీనామా చేస్తామంటూ అల్టిమేటం జారీ చేశారు. వైసీపీ అధిష్ఠానం ఇప్పటికే దళితులు ప్రాతినిథ్యం వహిస్తున్న తిరుపతి, చిత్తూరు ఎంపీ అభ్యర్థులను.. పూతలపట్టు, జీడీనెల్లూరు, సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చడంతో ఆ సామాజికవర్గంలో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

జీడీనెల్లూరు నుంచే మళ్లీ తనకో తన కూతురికో అవకాశం లభిస్తుందని బలంగా నమ్మిన నారాయణస్వామికి చేదు అనుభవం ఎదురైంది. ఎంపీగా పోటీ చేయడానికి ఏ మాత్రం ఆయన సుముఖంగా లేరు. అయినా ఆశ చావక, సీఎం జగన్‌ను కలిసేందుకు శనివారం నుంచి విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. దీనికి సమాంతరంగా ఆయన అనుచరవర్గం నిరసన స్వరం పెంచింది. శుక్రవారం కార్వేటినగరం, జీడీనెల్లూరు మండలాల వైసీపీ నాయకులు స్థానికంగా ప్రెస్‌మీట్లు నిర్వహించి నారాయణస్వామికే టికెట్ ఇవ్వాలంటూ తీర్మానించారు. శనివారం పెనుమూరు, ఎస్ఆర్‌పురం మండలాల నాయకులు చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో, వెదురుకుప్పం మండల నాయకులు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నారాయణస్వామికి మద్దతుగా ప్రెస్‌మీట్ పెట్టారు. నారాయణస్వామికి టికెట్ ఇవ్వకుంటే పదవులకు రాజీనామా చేస్తామంటూ అల్టిమేటం జారీ చేశారు. జ్ఞానేంద్రరెడ్డి వర్గానికి ఓటు బ్యాంకు లేదని ఆరోపించారు. నారాయణస్వామికి పెనుమూరు జ్ఞానేంద్రరెడ్డితో పాటు నియోజకవర్గంలోని రెడ్డి సామాజికవర్గం వ్యతిరేకంగా ఉన్నా, మిగిలినవర్గాలు ఆయనతోనే ఉన్నాయి. ఇప్పుడు పెద్దిరెడ్డికి నమ్మకస్తుడైన ఎంపీ రెడ్డెప్ప తెరమీదికి రావడంతో నారాయణస్వామికి టికెట్ రాకపోవడం వెనుక పెద్దిరెడ్డి ఉన్నాడనే అంశం ప్రచారం అవుతోంది. నారాయణస్వామితో ఉన్న వర్గాలన్నీ రెడ్డెప్ప అభ్యర్థి అయితే పనిచేయబోమని బహిరంగంగా చెప్తున్నాయి. రెడ్డెప్ప నాన్‌లోకల్ అనే మాట కూడా వైరల్ అవుతోంది.

రెడ్ల మాటే ఫైనల్

పెనుమూరు మండలానికి చెందిన జ్ఞానేంద్రరెడ్డి వర్గం ఆది నుంచీ నారాయణస్వామిని వ్యతిరేకిస్తోంది. వీరికి మంత్రి పెద్దిరెడ్డి అండ ఉండడంతో పదవులు దక్కాయి. పనులూ అయ్యాయి. అనేక మార్లు నారాయణస్వామికి టికెట్ ఇస్తే ఓడిస్తామంటూ వ్యతిరేకవర్గం ప్రకటించింది. అయినా నారాయణస్వామికి సీఎం జగన్‌తో ఉన్న సాన్నిహిత్యం దృష్ట్యా టికెట్ ఆయనకే వస్తుందనుకున్నారు. ఊహించని విధంగా ఆయన్ను మార్చేసి, నియోజకవర్గంతో ఏమాత్రం సంబంధం లేని రెడ్డెప్పకు టికెట్ ఇచ్చారు. నారాయణస్వామికి టికెట్ రాకుండా చేయడంలో పెద్దిరెడ్డి ప్రమేయం ఉందని ఆయన అనుచరులు ఆగ్రహిస్తున్నారు. డిప్యూటీ సీఎం అయినా కూడా రెడ్డి సామాజికవర్గం నిర్ణయమే ఫైనల్ అని వైసీపీలో రుజువైందని అంటున్నారు.



పెద్దిరెడ్డికి పంటికింద రాయి

జిల్లాలో పెద్దిరెడ్డి తర్వాత నేరుగా సీఎం జగన్‌ను కలిసి చనువుగా పనులు చేయించుకోగల వ్యక్తి నారాయణస్వామి అని పేరుంది. పెద్దిరెడ్డితోపాటు తొలి విడతలో మంత్రి పదవి దక్కించుకున్నారు. రెండో విడతలో పెద్దిరెడ్డికి మాత్రమే మంత్రి పదవి వస్తుందని, నారాయణస్వామికి ఇవ్వడం లేదని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. చివరి నిమిషంలో మళ్లీ పెద్దిరెడ్డితోపాటు మంత్రి పదవి కొనసాగింది. అవకాశం వచ్చినప్పుడల్లా తనను వ్యతిరేకించే రెడ్డి సామాజికవర్గం మీద విమర్శలు చేసేవారు. తన నియోజకవర్గానికి కలెక్టర్, జేసీ వంటి జిల్లా అధికారులను పిలుచుకువచ్చి సమావేశాలు, పర్యటనలు చేయించేవారు. తాను సిఫారసు చేసిన పని ఏదైనా అధికారులు నిర్లక్ష్యం చేస్తే 'రెడ్లు చెప్తేనే చేస్తారా.. దళితులు చెప్పే పనులకు విలువ ఇవ్వరా' అంటూ ప్రశ్నించి పనులు చేసుకునేవారు. ఈయన డిప్యూటీ సీఎం కావడంతో జిల్లా స్థాయిలో జరిగే ప్రతి సమావేశంలోనూ తప్పక ప్రాధాన్యం ఇవ్వాల్సి వచ్చేది. పెద్దిరెడ్డి జిల్లా అంతా శాసించినా, నారాయణస్వామి మాత్రం ఈ ఐదేళ్లు ఆయనకు పంటికింద రాయిలా మారారని చెప్పవచ్చు. అందుకే పెద్దిరెడ్డి జీడీనెల్లూరులో నారాయణస్వామి వ్యతిరేక వర్గాన్ని ప్రోత్సహించినట్లు చెబుతారు.

'గడప గడప'లో అవమానం జరిగినా..

జిల్లాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నారాయణస్వామి మిగిలిన ఎమ్మెల్యేల కంటే ఎక్కువగా చేశారు. అయినా అడుగడుగునా నిలదీతలు, అవమానాలు ఎదురయ్యాయి. జీడీనెల్లూరు మండలం పాచిగుంట గ్రామంలో ఈయన వస్తున్నారని ప్రజలు ఇళ్లకు తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. పూతలపట్టు మండలంలోని ఓ గ్రామంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పర్యటించి వెళ్లిపోయాక అక్కడివారు పసుపు నీళ్లు చల్లారు. దళిత ఎమ్మెల్యేలకు అవమానం జరిగినా మిగిలిన వైసీపీ ఎమ్మెల్యేలు స్పందించలేదని నారాయణస్వామి ఓ సందర్భంలో ఆవేదన చెందారు. ఇలా జిల్లాలో దళిత ఎమ్మెల్యేల పట్ల తొలి నుంచీ సొంత పార్టీ నాయకులే చిన్నచూపు ప్రదర్శిస్తున్నారు. తాజాగా టికెట్ విషయంలోనూ ఆ చిన్నచూపు కొనసాగింది.

తిరుపతికి పుస్తకాల పండుగొచ్చింది

తిరుపతి (కల్చరల్), జనవరి 20: తిరుపతి నగరానికి మరో మారు పుస్తకాల పండుగొచ్చింది.భారతీయ విద్యాభవన్ ఏటా నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శన 16వ సారి శనివారం మొదలైంది.ఇస్కాన్ ఆలయం పక్కనున్న వినాయకనగర్ మైదానంలో సుమారు వందకు పైగా బుక్ స్టాళ్లతో, వేలాది అంశాలకు సంబంధించిన పుస్తకాలతో కొలువుదీరింది. పేరొందిన ప్రచురణ సంస్థలు విశాలాంధ్ర, నవయుగ, ఎమెస్కో, ప్రజాశక్తి, విజయవాణి ప్రింటర్స్, భారతీయ విద్యాభవన్ , రామకృష్ణ మిషన్, టీటీడీ, వావిళ్ల తదితర సంస్థలు ఎన్నో కొత్త, పాత పుస్తకాలతో అలరించడానికి సిద్ధమైనాయి. శనివారం సాయంత్రం పల్లకిలో పుస్తకాల ఊరేగింపుతో ఈ ప్రదర్శన ప్రారంభమైంది. వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి జ్యోతి వెలిగించి సభను ప్రారంభించారు.నిరంతరం అధ్యయనం చేయడం మనిషికి ఎంతో అవసరమన్నారు. ఎంత ఎక్కువగా చదువుకుంటే అంతగా మనసు వికసిస్తుందన్నారు.భారతీయ విద్యాభవన్ సంచాలకులు డాక్టర్ నడింపల్లి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ తిరుపతి నేడు మహానగరంగా విస్తరిస్తోందనీ, నగర ప్రజలకు అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో ఏటా పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. విశిష్ట అతిథులు ఎస్వీ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య పి. మురళి, తిరుపతి ఐఐటీ ఆచార్యులు ఎ. రఘురామరాజు మాట్లాడుతూ ఏ కాలంలో అయినా మంచి పుస్తకం మంచి స్నేహితుడిలాగా దారిచూపుతుందన్నారు.

నా భర్తను పోలీసులే చంపేశారు!

న్యాయం చేయాలంటూ విజయపురం పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితురాలి ధర్నా



విజయపురం పోలీసు స్టేషన్ ఎదుట కుటుంబీకులతో బైఠాయించిన భారతి

విజయపురం, జనవరి 20: 'నా భర్తను పోలీసులే చంపేశారు. న్యాయం చేయండి' అంటూ ఓ వివాహిత తన కుటుంబీకులతో కలిసి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగింది. ఈ సంఘటన విజయపురం పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం జరిగింది. బాధితురాలు భారతి మాటల్లోనే.. 'మాది విజయపురం మండలంలోని కేవీపురం దళితవాడ. శుక్రవారం రాత్రి 9.30 గంటలకు నా తమ్ముడు చంద్రశేఖర్‌తో కలిసి నా భర్త కుమార్ (46) బహిర్భూమికని వెళ్లారు. కొంతసేపటికి వారిద్దరినీ విజయపురం పోలీసులు విచారిస్తున్నట్టు గ్రామంలో ఓ వ్యక్తి చెప్పడంతో అక్కడికెళ్లి చూడగా వారి ఆచూకీ తెలియలేదు. దాంతో రాత్రి 10.30 గంటల వరకు కుటుంబీకులతో కలిసి గాలించినా ఫలితం లేకపోయింది. శనివారం ఉదయం 11 గంటలకు ఓ గుంటలో నా భర్త శవమై కనిపించాడు. విచారించడానికి తీసుకెళ్లి నా భర్తను పోలీసులే చంపేశారు. వారిపై చర్యలు తీసుకోవాలి' అని భారతి కన్నీరు మున్నీరుగా విలపించారు. న్యాయం చేయాలంటూ పోలీసు స్టేషన్ ఎదుట బంధువులతో కలిసి ధర్నా చేశారు. పోలీసుస్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో ఏఎస్పీ శ్రీలక్ష్మి, డీఎస్పీ రవికుమార్, సీఐలు శ్రీనివాసంతి, సురేశ్, సత్తిబాబు, ఎస్ఐలు శివశంకర్, దస్తగిరి, రమేశ్, రాజపుల్లయప్పలు సిబ్బందితో బాధితుల వద్దకొచ్చారు. కేసును సమగ్రంగా విచారించి, న్యాయం చేస్తామని సర్దుబాటు చేశారు.

మృతితో మాకు సంబంధం లేదు: పోలీసులు

'కేవీపురం దళితవాడలో సారా తయారీపై ఫిర్యాదు రావడంతో విజయపురం నుంచి ఇద్దరు పోలీసులు శుక్రవారం రాత్రి ఆ స్థావరంపై దాడి చేశారు. సారా కాస్తున్న ఇద్దరిలో చంద్రశేఖర్ పట్టుబడగా, కుమార్ పరారయ్యాడు. చంద్రశేఖర్‌ని మాత్రం పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చాం' అని పోలీసులు తెలిపారు. ఇక శనివారం ఉదయం కుమార్ కుటుంబీకుల ఫిర్యాదుతో సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తుల సమక్షంలో పరిశీలించగా చెరువులోని బురదలో చిక్కుకుని మృతి చెంది ఉన్నాడని గుర్తించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. కుమార్‌పై గతంలో కూడా నాలుగు కేసులు ఉన్నాయని, అతడి మృతితో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, జనవరి 20: అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు, భక్తులు గోవిందనామ స్మరణల నడుమ శ్రీవారి ఊంజలసేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని మేళతాలలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారికి మంగళ హారుతలిచ్చారు.

తలనీలాల వేలం ద్వారా రూ.1.73 లక్షల ఆదాయం

వడమాలపేట, జనవరి 20: సదాశివకోన ఆలయానికి తలనీలాల వేలం ద్వారా రూ.1.73 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ జయచంద్రన్ తెలిపారు. మార్చి నెల 8వ తేదీ మహాశివరాత్రి, చిత్రపౌర్ణమి సందర్భంగా తలనీలాలు పోగు చేసుకునే హక్కుకు స్థానిక గౌరీ శంకర దేవాలయం వద్ద శనివారం వేలం నిర్వహించారు.

అంగన్వాడీల రాస్తారోకో

పుత్తూరు, జనవరి 20: తమ డిమాండ్ల సాధన కోసం 40వ రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు శనివారం జాతీయ రహదారిని దిగ్బంధించారు. పుత్తూరు పున్నమి బైపాస్ కూడలిలో రాస్తారోకోకు దిగడంతో చెన్నై - తిరుపతి రహదారిలో వాహనాలు బారులుతీరి నిలిచిపోయాయి. పోలీసులు రంగప్రవేశం చేసి అంగన్వాడీలను పక్కకు నెట్టేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ హక్కుల కోసం పోరాటం చేయడం కూడా నేరమేనా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి పురుషోత్తం, అంగన్వాడీ నాయకులు మునికుమారి, విజయకుమారి, ధనమ్మ, రాధ, లలిత, మోహనలక్ష్మి, హైమావతి, అన్నపూర్ణ, కృష్ణవేణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై అంగన్వాడీలను పక్కకు లాగేస్తున్న పోలీసులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నారాయణవనం, జనవరి 20: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యులు దర్శిత్ రాజ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని జీఎన్ కండ్రిగలో సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధి, టైఫాయిడ్ జ్వరాల గురించి వివరించారు. ఇంటిచుట్టు పక్కల డ్రైనేజీ నీరు నిల్వ లేకుండా చూడాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాత వస్తువులు, నీటి నిల్వలు, కొబ్బరి చిప్పలు ఇళ్ల పరిసరాల్లో ఉంచుకోరాదని, దాని వల్ల దోమలకు నిలయంగా మారి విషజ్వరాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్రయ్య, జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సుదర్శన హోమం

వడమాలపేట, జనవరి 20: స్థానిక సంజీవరాయ దేవాలయం లో శనివారం సుదర్శన హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అయోధ్య శ్రీరామ మందిర విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా మూడు రోజులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం ఉదయం గోపూజ, సుదర్శన హోమం, సీతా సమేత రామచంద్రుల విగ్రహాల కు అభిషేకం చేసి పట్టుపతాంబరాలు, పూలమాలలతో అలంకరించారు. మంగళ హారతులిచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.



సుదర్శన హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

చట్టాలపై అవగాహన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి బేబీ రాణి

శ్రీకాళహస్తి, జనవరి 20: చట్టాలపై ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అవగాహన పెంపొందించు కోవాలని శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని కోకో కోలా శీతల పానీయాల కర్మాగారంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి బేబీ రాణి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావిం చాలని చెప్పారు. పరిశ్రమల నిర్వాహకులు పర్యావరణాన్ని దెబ్బ తీయకుండా నడుచుకో వాలని సూచించారు. పర్యావరణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూని యర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ, న్యాయవాదులు రాజేశ్వరరావు శ్రీరామ్, సుభాని పాల్గొన్నారు.

విద్యాలయం.. దేవాలయం

శ్రీకాళహస్తి, జనవరి 20: విద్యాలయం అక్షర జ్ఞానం నేర్పే దేవాలయం అని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత అన్నారు. పట్టణంలోని కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ.. జీవితాన్ని ప్రసాదించిన విద్యాసంస్థ రుణం తీర్చుకోలేమన్నారు. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, ప్రస్తుత వైస్ ప్రిన్సిపాల్ మురళి పాల్గొన్నారు.

31వ వార్డులో టీడీపీ ప్రచారం

శ్రీకాళహస్తి, జనవరి 20: శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి శ్రీకాళహస్తి పట్టణం 31వ వార్డు పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీలో శనివారం 'బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు విజయకుమార్, మాజీ ఎమ్మెల్యే సత్రవాడ ముని రామయ్య కుమారుడు ప్రవీణ్, పార్లమెంట్ కోశాధికారి కంఠా రమేష్, ప్రకాష్‌నాయుడు, ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ


అక్షింతలు పంపిణీ చేస్తున్న కోలా ఆనంద్


శ్రీకాళహస్తి, జనవరి 20: అయోధ్య నుంచి విచ్చేసిన అక్షింతలు, ఆహ్వాన పత్రికలను శనివారం పట్టణంలోని గాంధీ వీధిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ముక్కంటి ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, మాజీ ఛైర్మన్ కోలా ఆనంద్ సంయుక్తంగా హాజరయ్యారు. అయోధ్య పూజిత అక్షింతలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా సెక్రటరీ సుబ్రమణ్యంరెడ్డి, పట్టణ అధ్యక్షులు గరికపాటి రమేష్‌బాబు పాల్గొన్నారు.

హత్య కేసు ఛేదనపై అభినందన


డీఐజీ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ అజయ్‌కుమార్

శ్రీకాళహస్తి, జనవరి 20: హత్య కేసును ఛేదించడంపై శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్ కుమార్‌ను అనంతపురం డీఐజీ అమ్మిరెడ్డి అభినందించారు. తిరుపతిలో శనివారం క్రైమ్ మీటింగ్ జరిగింది. గత నెల 19న శ్రీకాళహస్తి మండలం అమ్మపాలెం వద్ద దామినేడుకి చెందిన విద్యాలతను హతమార్చి పంట కాలవలో పడవేసిన విషయం తెలిసిందే. ఈ కేసును వేగవంతంగా దర్యాప్తు చేశారు. దీనిపై సీఐ అజయ్ కుమార్‌ను అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు.

శనీశ్వర స్వామికి విశేష పూజలు



శ్రీకాళహస్తి జనవరి 20: శ్రీకాళహస్తీశ్వ రాలయంలోని శనీశ్వర స్వామికి విశేష పూజలు జరిగాయి. శనివారం పురస్కరించుకుని ముందుగా అర్చకులు శనీశ్వర స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం సంకల్పం పూజలు చేశారు. వివిధ పూజా ద్రవ్యాలతో పాటు శని ప్రీతి కోసం విశేషంగా తైలాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి విశేషాలంకారంతో దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వ్యాసాశ్రమ పీఠాధిపతికి అయోధ్య అక్షింతలు



ఏర్పేడు, జనవరి 20: ఏర్పేడు వ్యాసాశ్రమం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామికి శనివారం అయోధ్య రామమందిరం అక్షింతలను అయోధ్య అక్షింతల వీహెచ్‌పీ ప్రముఖ్ అదూరు శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సదాశివయ్య, వివేక్, విమలానందస్వామి పాల్గొన్నారు.

దొంగ ఓట్లను తొలగించాలని ధర్నా


ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జన సైనికులు

తిరుపతి (కొర్లగుంట), జనవరి 20 : తిరుపతిలో నమోదు చేసిన దొంగ ఓట్లను తొలగించాలని, లేకపోతే కోర్టులను ఆశ్రయించాల్సి వస్తుందని జనసేన నేతలు పసుపులేటి డాక్టర్ హరిప్రసాద్, కిరణ్‌రాయల్, రాజారెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం వారు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. దొంగల రాజ్యం, దోపిడి రాజ్యం అంటూ నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ తిరుపతిలో దాదాపు 40వేల దొంగ ఓట్లు నమోదై ఉన్నాయని, వాటిని తొలగించే వరకు ఓటర్ల తుది జాబితా విడుదలను వాయిదా వేయాలని అన్నారు. ఈ దురాఘతానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్ కార్డుకు ఆధార్ లింకు చేయాలని డిమాండ్ చేశారు. నీతి నిజాయితీగా ఉంటే గెలవలేమని భావించి దొడ్డిదారిన మళ్లీ అధికారంలోకి రావాలనుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. తిరుపతిని దొంగ ఓట్లకు నిలయంగా మార్చేసి, సభ్య సమాజం తలదించుకునేలా చేశారని అన్నారు. నేతల అధికార దాహానికి అధికారులు బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో నిషాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

కులగణన పక్కాగా నిర్వహించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ భార్గవి

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 20: మండలంలో కులగణన సర్వేను పక్కా నిర్వహించాలని తహసీల్దార్ భార్గవి తెలిపారు. మండలంలో 28 పంచాయ తీలలో గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, వీర్వోలు కుల గణనపై సర్వే చేస్తున్నారని తెలిపారు. కులగణనను సర్వేను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కుటుంబ సభ్యుల వివరాలను ఫోన్ ద్వారా చేయవలసి ఉంటుందని చెప్పారు. సర్వేలో కుటుంబలో రేషన్ కార్డు వివరాలు, విద్య, మరుగు దొడ్లు, తాగునీరు, గేదెలు, కోళ్లు , వంట గ్యాస్, లేదా కట్టెల పొయ్యి తదితర వివరాలు సైతం నమోదు చేయాలన్నారు. సర్వేలో కుటుంబ సభ్యులు చెప్పిన కులము మాత్రమే నమోదు చేయాలన్నారు. కులానికి సంబంధించిన ఆధారాలు అడగరాదని స్పష్టం చేశారు. సర్వే పూర్తయిన తరువాత ఈకేవైసీ, బయోమెట్రిక్ తప్పనిసరిగా చేయాలన్నారు.

ఆలత్తూరులో ఆరోగ్య సురక్ష శిబిరం

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 20: మండలంలోని ఆలత్తూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శనివారం జరిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దివాకర్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల అందజేత

ఏర్పేడు, జనవరి 20: మర్రిమంద గ్రామంలో శనివారం అయోధ్య శ్రీరామ జన్మభూమి అక్షింతలను విశ్వహిందూ పరిషత్ ప్రముఖ్ అదూరు శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి అక్షింతలు, శ్రీరాముడి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నాగరాజు, రెడ్డికిరణ్, సుబ్రహ్మణ్యం రెడ్డి, పురుషోత్తంరెడ్డి, గురవారెడ్డి, శ్రీరంజని, సుగుణ, రజని, శ్రీరామ భక్తబృందం పాల్గొన్నారు.

క్రికెట్ విజేత పెరిందేశం



కేవీబీపురం, జనవరి20: మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు శనివారంతో ముగిశాయి. ఫైనల్స్‌లో సదాశివపురం జట్టుపై పెరిందేశం జట్టు గెలుపొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది.

టీడీపీ నాయకుడికి బృందమ్మ నివాళి

తొట్టంబేడు, జనవరి 20: మండలంలోని గురప్ప నాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన సుబ్బానాయుడు శనివారం మృతిచెందాడు. బొజ్జల బృందమ్మ ఆయన మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు లెక్కల మురళినాయుడు, మునిరాజనాయుడు పాల్గొన్నారు.

అంగన్వాడీల రాస్తారోకో


శ్రీకాళహస్తిలో మానవహారం

సత్యవేడు, జనవరి 20: తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న అంగన్వాడీలు సమ్మెలో భాగంగా శనివారం పట్టణంలో రాస్తారోకో నిర్వహించారు. సత్యవేడులో స్థానిక గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. గాంధీ విగ్రహం కూడలిలో సుమారు గంట పాటు ఎక్కడ వాహనాలు అక్కడ నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించి పోయింది. పోలీసులు వారికి నచ్చజెప్పారు. అయినా వారు ససేమిరా అనడంతో రమేష్‌ని అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. దీంతో అంగన్వాడీలు రాస్తారోకోను విరమించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మురళి, అంగన్వాడీ కార్యకర్తలు శాంతి, ఝాన్సీ, భారతి, భువన, అనురాధ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: కార్మికులను క్షోభ ఈప్రభుత్వానికి మంచిది కాదని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి వైఎస్ మణి అన్నారు. అంగన్వాడీల సమ్మెలో భాగంగా పట్టణంలోని ఏపీ సీడ్స్ కూడలి వద్ద పీఎన్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాల నాయకులు అంగన్వా డీలకు సంఘీభావం తెలిపారు. ఐసీడీఎస్ కేంద్రం వద్ద నుంచి కార్మిక సంఘాలతో కలిసి అంగన్వాడీలు ఏపీ సీడ్స్ కూడలి వద్దకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం జాతీయ రహదారిపై మానవ హారంతో రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పుల్లయ్య, హరికృష్ణ, గోపి మురళి శివ అయ్యప్ప, గురవయ్య, రాజా, శోభ స్వర్ణ పాల్గొన్నారు.

పిచ్చాటూరు: పిచ్చా టూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో తిరుపతి -చెన్నై జాతీయ రహదారిపై అంగన్వాడీలు సీఐటీయూ నాయకులతో కలసి రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేశారు. దీంతో గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు వారితో మాట్లాడి అక్కడి నుంచి ఖాళీ చేయించారు.

రేణిగుంట: సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు హరినాథ్, జయలక్ష్మి, మోహన్‌రెడ్డి స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద అంగన్వాడీలతో కలిసి రాస్తారోకో చేశారు. తమ పోరాటానికి మద్దతు తెలిపిన కార్మిక సంఘాల నాయకులకు అంగన్వాడీలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడు సంఘాల నాయకులు పాల్గొన్నారు.




సత్యవేడు, రేణిగుంట, పిచ్చాటూరులో రాస్తారోకో చేస్తున్న అంగన్వాడీలు

టెండర్లకు దరఖాస్తుల ఆహ్వానం

నాగలాపురం, జనవరి 20: సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించి వివిధ సామగ్రి సరఫరా కోసం టెండర్లకు దరఖాస్తులు ఆహ్వా నిస్తున్నట్లు ఆలయ ఈవో రామచంద్రారెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 29న ప్రారంభమయ్యే మహాశివరాత్రి ఉత్సవాలు మార్చి నెల 10వ తేదీన ముగుస్తాయి. ఈ 11 రోజులకు ఆలయంలో జరిగే నిత్య పూజలకు పూజా సామగ్రి, పుష్పాలంకరణకు పుష్పాలు, నిత్యాన్నదానానికి బియ్యం, పప్పు, కూరగాయలు వంటి వంట సామగ్రి, ఆలయం వెలుపల చలువ పందిళ్లు, లోపల, బయట పెయింటింగ్ పనులు, విద్యుత్ అలంకరణ, గోశాలలోని గోవులకు మేత వంటి వాటిని అందించేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నామని వివరించారు. ఒక్కో టెండరుకు నిర్ణయించిన నగదును ఏదైనా జాతీయ బ్యాంకులో డీడీ తీసుకుని ఆలయ కార్యాలయంలో అందించి టెండరులో పాల్గొనవచ్చన్నారు. ఈ నెల 24న మధ్యాహ్నం 2 గంటలకు దేవాదాయ శాఖాధికారుల సమక్షంలో ఆలయ కార్యాలయంలో టెండర్లను తెరవనున్నట్లు వెల్లడించారు.

ఇంటింటా అక్షింతల పంపిణీ

పిచ్చాటూరు, జనవరి 20 మండలంలోని కారూరు గ్రామ పంచాయతీలో ఇంటింటికీ అయోధ్య అక్షింతలను బీజేపీ నాయకులు శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు మునికృష్ణయ్య, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు, తిరుపతి సత్యనారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి తిరు పతి, ఆనందనాయుడు, మండల అధ్యక్షుడు బ్రహ్మానంద రెడ్డి, నాయకులు చిన్నారి, యువశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదం.. ఇరువర్గాల ఫిర్యాదు

సత్యవేడు, జనవరి 20: మండలంలోని పేరడం గ్రామంలో ఓ భూ వివాదంపై ఇరు వర్గాలు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నాయి. గ్రామంలోని సర్వే నెం.191లో సుమారు ఎకరం ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురై ఉందని సర్పంచ్ సంగీత భర్త కనకరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికా రులకు శనివారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కొందరు దళితులు భూమిని ఆక్రమించుకున్నారని ఆ భూమిని ప్రజా ప్రయోగ కార్యక్రమాలకు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం అదే గ్రామం దళితవాడకు చెందిన పలువురు కేవీపీఎస్ నాయకుడు రమేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. పదేళ్లుగా తమ అనుభవంలోని భూమిలోకి అగ్రవర్ణాలు వారు ప్రవేశించి చెట్లను ఎక్స్‌కవేటర్లతో తొలగించారని కిష్టయ్య, రోస్లిన్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అగ్రకులస్తుల దౌర్జన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశారు.

అగ్రవర్ణ పేదలకు అండగా ఉంటా



శ్రీకాళహస్తి, జనవరి 20: అగ్రవర్ణ పేదలకు తనవంతు అండగా ఉంటానని టీడీపీ శ్రీకాళహస్తి నియోజక వర్గం ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. ఊరందూరులోని ఆయన స్వగృహంలో శనివారం రెడ్డి సంఘం సభ్యులు సుధీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రెడ్డి సామాజిక వర్గంలోని పేదలకు సేవ చేసేందుకు రెడ్డి ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నామని సభ్యులు తెలిపారు. పేదలకు తనవంతు సహాయం చేస్తానని సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. బొజ్జల బృందమ్మ పాల్గొన్నారు.

ఈ -క్రాప్‌లో నమోదు చేసుకోవాలి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 20 : రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈక్రాప్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి ప్రసాదరావు కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. రబీ పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవడమేగాక ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. మిచౌంగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీతో వరి విత్తనాలను సరఫరా చేశామని, పంట నష్టపరిహారాన్ని త్వరలోనే అందజేస్తామని చెప్పారు.

బాయ్స్ కబడ్డీ విజేత నీరువాయి

పిచ్చాటూరు, జనవరి 20: పిచ్చాటూరులో ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా శనివారం జరిగిన మండలస్థాయి కబడ్డీ పోటీల్లో నీరువాయి బాయ్స్ కబడ్డీ జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా పిచ్చాటూరు సచివాలయ జట్టు నిలి చింది. విజేతకు ఎంపీడీవో శ్రీనివాసులు ట్రోఫీ అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో యుగంధర్‌రాజు, మహిళా పోలీసు లక్ష్మి, పీఈటీ అమ్ములు, పంచాయతీ కార్యదర్శి మహాలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ వెంకటముని పాల్గొన్నారు.

తొట్టంబేడు ఎస్ఐకి ప్రశంసాపత్రం



తొట్టంబేడు, జనవరి 20: మిచౌంగ్ తుఫాను కారణంగా వాగులో చిక్కుకున్న వారిని కాపాడినందుకు ఎస్ఐ రాఘవేంద్ర ప్రశంసాపత్రం అందుకున్నారు. శనివారం తిరుపతిలోని పద్మావతి యూనివర్శిటీలో పోలీసుల సమీక్షా సమావేశం నిర్వహించారు. సాహసం చేసిన పోలీసులకు పశ్రంసా పంత్రాలు అందజేశారు. ఈ క్రమంలో ఎస్ఐ రాఘవేంద్ర అనంతపురం డీజీపీ అమ్మిరెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. గత ఏడాది నవంబరు 29న కారాకొల్లు వద్ద గుండ్లకమ్మ వాగులో కారాకొల్లు గ్రామానికి చెందిన చినబత్తెయ్య నాయుడు, నాగరత్నమ్మలను దంపతులను ఎస్ఐ కాపాడిన విషయం తెలిసిందే.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.39 కోట్లు

తిరుమల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.39 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 69,874 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 26,034 మంది తలనీలాలు సమర్పించారు.

నేడు అయోధ్యకాండ అఖండ పారాయణం

తిరుమల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల నాదనీరాజనం వేదికపై ఆదివారం 6వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు జరుగనున్న ఈ కార్యక్రమంలో అయోధ్యకాండలోని 18 నుంచి 21వ సర్గల వరకు 199 శ్లోకాలు, యోగవాశిష్ఠం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 224 శ్లోకాలను పారాయణం చేస్తారు. ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారం చేయనున్న ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని టీటీడీ కోరింది.

17నుంచి గోవిందరాజస్వామి తెప్పోత్సవాలు

తిరుపతి (కల్చరల్), జనవరి 20: గోవిందరాజస్వామి తెప్పోత్సవాలను ఫిబ్రవరి 17 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు టీటీడీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు తెప్పోత్సవాలు జరుగుతాయని పేర్కొంది. 17వ తేదీన కోదండరామస్వామి వారు పుష్కరిణిలో ఐదుసార్లు తెప్పలపై విహరిస్తారని వివరించింది. హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజక్టు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపింది.

వేరుశనగ పంటకు చీడలు.. ఆందోళనలో రైతులు



కేవీబీపురం, జనవరి20: మండలంలోని వేరుశనగ పంటకు వ్యాపించిన చీడపీడలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మిచౌంగ్ తుఫానుతో దెబ్బతిని పోగా మిగిలిన పంటను కాపాడుకున్న రైతులు ఇప్పుడు చీడపీడల సమస్యతో కుంగిపోతున్నారు. ప్రస్తుతం పూత దశలో ఉన్న పంటకు చీడ సోకడంతో పూత రాలి చెట్టు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. పురుగు నివారణ మందులు వాడుతున్నా ఫలితం అంతంతమాత్రంగానే ఉందని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు.